నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 26-5-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 236 | పేజీలు:6 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

ధర్మం గొప్పది
చిలుక పలుకులు
తానే తందాన.

ప్రజా పాలన
వెతకాలి భూగోళం
ఆశ ఆవిరి.

లంకా దహనం
ధరల భగభగ
ప్రజా ఆగ్రహం.

రోబో ఎలుక
నూతన గూఢచారి
పిల్లికావాలి.

పి.కె.సినిమా
కొత్త ప్రయోగశాల
పైసా వసూలు.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

కోట్ల పెట్టుబడులతోటి
రాష్ట్రానికి ఆశ్వీర్వాద్ !
ఉత్పత్తులు ఎగుమతైతె
ఉత్తిష్ఠ హైదరాబాద్ !

కొట్టొచ్చినట్టు కనపడె
దావోస్ లో తెలంగాణ !
కుప్పలు తెప్పలుగాపడె
పెట్టుబడులిట ధనాదన !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

రాజ్యసభకు.. దామోదర్‌రావు, పార్థసారథి నామినేషన్

హైదరాబాద్, మే 25: రాజ్యసభకు టీఆర్ఎస్ అభ్యర్థులు దీవకొండ దామోదర్‌రావు, బండి పార్థసారథి రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్‌రెడ్డి, మల్లారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నామినేషన్లను దాఖలు చేశారు.

తెలంగాణ నుంచి వచ్చే నెల 21తో పదవీకాలం ముగియనున్న రెండు రాజ్యసభ స్థానాలకు గత మంగళవారం నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా దామోదర్‌రావు, బండి పార్థసారథికి జగిత్యాల ఎమ్మెల్యే బండి సంజయ్‌కుమార్‌తో పాటు పలువురు నేతలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, మే 25: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టం చేశారు. సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో రూ. 66 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి బుధవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరై పూజలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 66 లక్షలు నిధులు మంజూరు చేశామని అన్నారు. ఇప్పటివరకు రూ. 30 లక్షలతో పనులు పూర్తి చేసామని తెలిపారు. మరో రూ. 36 లక్షలతో ప్రహరి గోడ, ఇతర అభివృద్ధి పనులు చేస్తామన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో దాదాపు 500 పై చిలుకు దేవాలయాలను అభివృద్ధి చేసుకున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ పర్సన్ విజయ లక్ష్మి రాంకిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్ చారి, అల్లోల మురళీధర్ రెడ్డి , ఎఫ్ఎన్‌సీఎస్ చైర్మన్ ధర్మజి రాజేందర్, సర్పంచ్ హరిత శ్రీనివాస్, జడ్పిటిసి జీవన్ రెడ్డి, మండల నాయకులు మోహినోద్దీన్, కృష్ణ ప్రసాద్, వినోద్, ఆత్మ చైర్మన్ గంగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనసీమలో కొనసాగుతున్న ఉద్రిక్తత.. జిల్లాలో 144 సెక్షన్

అమరావతి, మే 25: ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ (ఐనీనిజీబవఎజీ) జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. జిల్లాలో 144వ సెక్షన్ విధించారు. పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. ఘర్షణలకు కేంద్రమైన అమలాపురంని పోలీసులు పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అల్లర్లు జరుగకుండా భారీగా బలగాలను మోహరించారు. పట్టణంలో ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. బస్సు సర్వీసులను నిలిపివేశారు. సున్నితమైన ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షించే బాధ్యతలను సీనియర్ ఐపీఎస్‌లకు బాధ్యతలు అప్పగించారు. ర్యాలీలు, నిరసనలు, బహిరంగ సభలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుతం పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

కొనసీమ జిల్లా పేరును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు నెల రోజుల సమయం కేటాయించింది. అయితే పేరును మారమార్చొద్దంటూ కోనసీమ జిల్లా సాధన సమితి అమలాపురంలో మంగళవారం భారీఎత్తున ఆందోళన నిర్వహించింది. అదికాస్తా అదుపుతప్పి హింసాత్మకంగా మారింది. మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ఇండ్లకు, బస్సులకు ఆందోళనకారులు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే.

ఇంటర్‌నెట్ సేవలు బంద్..

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అమలాపురంలో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. అన్ని నెట్‌వర్క్‌లకు సంబంధించిన ఇంటర్‌నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. పరిస్థితులు చక్కబడేవరకు ఇది అమల్లో ఉంటుందని అధికారులు చెప్పారు.

రెండు బైకులు ఢీకొని, ఇద్దరు మృతి.. హన్మకొండ జిల్లాలో ఘటన

వరంగల్, మే 25:హన్మకొండ జిల్లాలో రెండు బైకులు ఢీకొన్న ఘటన జరిగింది. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి స్టేజి వద్ద ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొనడంతో అక్కడికక్కడే ఇద్దరు చనిపోయారు. సమాచారం అందుకున్న ముల్కనూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా, మృతుల్లో ఒకరు కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్కిరెడ్డి లింగారెడ్డి. ఇంకొకరు హన్మకొండకు చెందిన లవకుమార్ గా గుర్తించారు. ముల్కనూరు ఎస్ ఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చరిత్రలో నేటినిజం



తం॥ చిటతిట మాలన చెట్టను
తెలుగుల తిండించినట్టి తొయుని తేవిగా
పటపటు గాలిచిన "బుస్తా
బుబ"నకు భవుడంద జేసి నిప్పిలుపుశతమునే!!

(మే 26 చెట్టుకవి యిస్మాయిల్ జయంతి..)

–రాధశ్రీ
సెల్: 9494481210

సీఎం కేసీఆర్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర

హైదరాబాద్, మే 25:రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయిన సందర్భంగా, కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుని వద్దిరాజు రవిచంద్ర ఇవ్వాల (బుధవారం) ప్రగతి భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, నవీన్ రావు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్ రావు , ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు విప్ రేగా కాంతా రావు, వనమా వెంకటేశ్వర్ రావు, ఉపేందర్ రెడ్డి, రాములు నాయక్, మెచ్చా నాగేశ్వర్ రావు తదితర ప్రజా ప్రతినిధులున్నారు.

సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష : మంత్రి జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, మే 25:గులాబీ జెండాయే అందరికి అండ అని.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని ప్రజలంతా నమ్ముతున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. గత ఎనిమిదేండ్లుగా రాజకీయాలకతీతంగా జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై టీఆర్ఎస్‌లో చేరికలు జరగడం అభినందనీయమన్నారు.

మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు(ఎస్) మండలం రామన్న గూడెంకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెట్టు రాంరెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు.. గులాబీ కండువాను కప్పుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే విపక్ష పార్టీలు ఖాళీ అయ్యాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతోందన్నారు. ఎ

టీఆర్ఎస్‌లో చేరిన వారిలో జంగాల గౌరయ్య, జంగాల మరియమ్మ, బొక్క ఉపేందర్ రెడ్డి, గొలుసు వెంకయ్య, ఆలకుంట్ల ఉప్పలయ్య, గొలుసుల ముత్తయ్య, పుల్లూరి సైదులుతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు తూడి నర్సింహ రావు, కొనతం సత్యనారాయణ రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని.. బేగంపేట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, మే 25: ప్రధాని నరేంద్ర మోదీ గురువారం హైదరాబాద్ లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్టు పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రీన్ ల్యాండ్స్, ప్రకాశ్ నగర్ టీ జంక్షన్, రసూల్‌పురా టీ జంక్షన్, సీటీవో జంక్షన్ మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

ఇక ప్రధానికి స్వాగతం పలికేందుకు వచ్చే ప్రముఖులకు మాత్రమే అనుమతిస్తారు. వీరంతా ఎయిర్‌పోర్టు పార్కింగ్ ఏరియాలో తమ వాహనాలను నిలుపుకోవచ్చు. సిటిజెన్స్‌తో పాటు ఇతరులు ఎయిర్‌లైన్ కాలనీ పార్కింగ్ ఏరియాలో తమ వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అయితే ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

దళిత కుటుంబాలల్లో వెలుగులు నింపుతున్న దళిత బంధు

హైదరాబాద్, మే 25: దళితులకు నిజమైన ఆత్మ బంధువు సీఎం కెసిఆర్ అని నిరూపించే పథకాల్లో విశిష్టమైన, విశేషమైన పథకం దళిత బంధు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం మన తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే అమలవుతున్న పథకం. అంబేద్కర్ తర్వాత సీఎం కెసిఆర్ గారే దేశంలో దళితుల గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నారనడానికి దళిత బంధు నిదర్శనం. దళితుల స్వావలంబన, సమగ్ర అభ్యున్నతి లక్ష్యంగా దళిత బంధు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది.

దళితుల బాగు కోసం దేశంలో ఇప్పటి వరకు ఎవరూ చేయలేని విధంగా దళిత బంధు పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నది. దళితుల్లో ఆర్థిక సాధికారతయే లక్ష్యంగా దళిత బంధు పథకాన్ని సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రతి దళిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఘనత సీఎం కేసిఆర్ గారికే దక్కుతుంది. మూడేళ్లలో రాష్ట్రంలోని దళితులందరికీ లబ్ది చేకూరేలా మూడు విడతలుగా ఈ పథకాన్ని అమలు చేయాలన్నది సిఎం సంకల్పం. ఇందు కోసం రాష్ట్రంలోని 17 లక్షల దళిత కుటుంబాలకు 1.70 లక్షల కోట్లు కేటాయింపునకు సీఎం సిద్ధంగా ఉన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో దళిత బంధు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 17 వేల 700 కోట్ల రూపాయలు కేటాయించింది.

మొదటి విడతగా ఎంపిక చేసిన గ్రామాల్లో 118 నియోజకవర్గాలకు 100 కుటుంబాల చొప్పున దళిత బంధు ఇస్తున్నారు.నిజానికి దళిత బంధు పథకం ఆగస్టు 16, 2021ననే హుజూరాబాద్ లో ప్రారంభమైంది. ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన ఈ పథకం పకడ్బందీ అమలు కో?సం కొంత సమయం తీసుకున్నారు. ఈ పథకం పర్యవేక్షణకు సీఎం కార్యాలయంలో ఒక ప్రత్యేక కార్యదర్శిని నియమించారు. ఎవరి, ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండానే నేరుగా లబ్దిదారుని అకౌంట్లోకే డబ్బులు పడే అద్భుత పథకం దళిత బంధు.

దళిత బంధు లక్ష్యం

రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబాన్ని ఆదుకోవడం. దళిత కుటుంబాల ఆదాయాన్ని పెంచడం తద్వారా దళితుల్లో తాము ఎవరికంటే తక్కువ కామనే ఆత్మవిశ్వాసాన్ని పెంచడం. సమాజంలో దళితుల ఆత్మగౌరవాన్ని పెంచడం. సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని సాధించడమే దళిత బందు లక్ష్యం.

దళిత బంధు విశిష్టతలు

కుటుంబం ఒక యూనిట్ గా ప్రతి ఎస్సీ కుటుంబానికి పూర్తి సబ్సిడీతో రూ. 10 లక్షలను బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా నిధి మొత్తం ఒకేసారి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం నేరుగా జమ చేస్తున్నది. లబ్ధిదారుల నైపుణ్యం, అనుభవం, తమకు ఆసక్తివున్న యూనిట్ ను ఎంపిక జేసుకునే వెసులు బాటు లబ్దిదారులకు కల్పించడం జరిగింది.

దళిత బందు అమలు కోసం సిఎంఓలో ప్రత్యేక ఐఎఎస్ అధికారి:-

దళిత బంధు పర్యవేక్షణకు గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దళిత బంధు కమిటీల ఏర్పాటు.

పైలెట్ ప్రాజెక్టుగా:-

హుజూరాబాద్ లో దళిత బంధు ప్రారంభమైంది. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారు. ఖమ్మం జిల్లా చింతకాని, సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ, కామారెడ్డి జిల్లా నిజాంసాగర్. నేడు రాష్ట్రంలోని 118 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దళిత బంధు అమలు అవుతున్నది. 2021-22 సంవత్సరంలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 100 యూనిట్లు మంజూరు

నిధులు:-

2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ. 4,441 కోట్ల రూపాయలు కేటాయించారు. ఇప్పటి వరకు 40 వేల మంది లబ్ధిదారులకు 4 వేల కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది . 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1 లక్ష 75 వేల కుంబుంబాలకు రూ. 17,700 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని దళిత బంధు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్నది. లబ్ధిదారులతో దళిత బంధు రక్షణ నిధి ఏర్పాటు చేసి అనుకోని ఆపదల నుండి లబ్దిదారుల కుటుంబాలని కాపాడెందుకు దళిత రక్షణ నిధి ఏర్పాపు చేయబడింది. రూ.10వేల లబ్దిదారుడి వాటాకు అంతే మొత్తం ప్రభుత్వ వాటాతో కలిపి దళిత బంధు రక్షణ నిధి ఏర్పాటు చేయబడింది.

లబ్ధిదారులు వ్యాపారంలో ఎదుర్కొనే తీవ్ర సమస్యల నుంచి ఆదుకోవడంకూడా ఈ నిధి విధి. దళిత బంధుతో పాటు రాష్ట్ర ప్రభుత్వ లైసెన్స్‌ల ద్వారా ఏర్పాటు చేయు ఫెర్టిలైజర్, మెడికల్, మద్యం దుకాణాలు తదిత లాభాదాయక వ్యాపారాలలో దళితులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. దళితుల సంక్షేమంలో దళిత బంధు అమలు ఒక సువర్ణ అధ్యయనంగా పేర్కొనవచ్చును.

దళితుల సామాజిక ఆర్థిక అభివృద్ధికి సరికొత్త బాటలు వేసే దళిత బంధును లబ్ధిదారులు పూర్తిగా సద్వినియోగపర్చుకున్నప్పుడే ప్రభుత్వ ఆశయానికి సార్థకత చేకూరుతుంది. ముఖ్యమంత్రి శ్రీ కె చంద్రశేఖర్ రావు దూరదృష్టితో రూపొందించిన దళితబందు ఫలితాలు రాష్ట్రంలో అప్పుడే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం దళిత బందు కింద ఇచ్చిన రూ.10 లక్షలకు తమ నైపుణ్యాన్ని జోడు చేసి ఆత్మగౌరవంతో దళితులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తాం : ఎండీ సజ్జనార్

హైదరాబాద్, మే 25: నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తామని టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని స్మైలింగ్ స్టార్స్ ప్లే స్కూల్‌ను సజ్జనార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం టీఎస్ ఆర్టీసీ నష్టాల్లో ఉందన్నారు.

గతేడాది రూ. 2,200 కోట్ల నష్టం వచ్చిందని తెలిపారు. నష్టాలను అధిగమించి లాభాల బాట పట్టించేందుకు ఆర్టీసీ యాజమాన్యం కృషి చేస్తోందన్నారు.కొవిడ్‌తో పాటు ఇంధన ధరలు పెరగడంతో ఆర్టీసీ నష్టాల్లో ఉందన్నారు. కార్గో సర్వీస్‌లను మెరుగుపరుస్తామన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు, కొత్త బస్సులు, నూతన సంస్కరణల ద్వారా రానున్న రోజుల్లో ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపిస్తామన్నారు. ఇటీవల అమలు చేసిన మ్యాంగో ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని సజ్జనార్ పేర్కొన్నారు.

బారాముల్లాలో ఎన్‌కౌంటర్ ముగ్గురు ఉగ్రవాదులు హతం.. పోలీస్ వీరమరణం

శ్రీనగర్, మే 25: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పాక్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రవాదుల కాల్పుల్లో జమ్మూకశ్మీర్ పోలీస్ వీరమరణం పొందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బారాముల్లాలోని క్రీరి ప్రాంతంలో నజీభట్ క్రాసింగ్ వద్ద ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా దళాలు, పోలీసుల సంయుక్త బృందం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి.

ఈ క్రమంలో దాక్కున్న ఉగ్రవాదులు బలగాలను చూసి, వారి పైకి కాల్పులు జరిపాయి. సైన్యం సైతం ప్రతిగా కాల్పులు జరుపడంతో ముగ్గురు హతమయ్యారు. ముగ్గురు పాక్‌కు చెందిన ఉగ్రవాదులని తెలిపారు. టెర్రరిస్టులు జరిపిన కాల్పుల్లో జేకేపీ జవాన్ వీరమరణం పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు కశ్మీర్ ఐజీపీ తెలిపారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని, ప్రస్తుతం కూంబింగ్, సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని వివరించారు.

స్కూల్‌పై అటాక్.. ఈ ఏడాది ఇది 27వ ఘటన

వాషింగ్టన్, మే 25: టెక్సాస్‌లో జరిగిన స్కూల్ కాల్పుల ఘటనలో 19 మంది చిన్నారులు మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది అమెరికాలో స్కూల్ షూటింగ్ ఘటనలు 27 జరిగినట్లు తెలస్తోంది. ఇటీవల బఫెలో నగరంలోని సూపర్‌మార్కెట్‌లో కాల్పుల ఘటన జరిగిన విషయం తెలిసిందే. అయితే అమెరికాలో 2018 సంవత్సరం నుంచి స్కూల్ షూటింగ్స్ జరుగుతన్న ఘటనల డేటాను ఎడ్యుకేషన్ వీక్ అనే సంస్థ పొందుపరుస్తోంది. ఆ సంస్థ డేటా ప్రకారం ఇప్పటి వరకు 2018 నుంచి ఆ దేశంలో 119 స్కూల్ అటాక్ జరిగినట్లు తెలుస్తోంది. తూపాకీలు ఎక్కడ వాడారు, ఎవరికైనా బుల్లెట్ గాయం అయ్యిందా అన్న కోణంలో ఎడ్యుకేషన్ వీక్ సమాచారాన్ని సేకరిస్తుంది. కే-12 స్కూల్ ప్రాపర్టీల వద్ద కానీ స్కూల్ బస్సుపై జరిగే కాల్పుల ఘటనలను ఎడ్యుకేషన్ వీక్ సంస్థ సేకరిస్తుంది.

అమెరికాలో ఈ ఏడాది కాల్పుల ఘటనలు అత్యధిక స్థాయిలో నమోదు అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆ దేశంలో సుమారు 200 సామూహిక కాల్పుల ఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ద గన్ వాయిలెన్స్ ఆర్కివ్ దీనికి సంబంధించిన డేటాను తయారు చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 212 సామూహిక కాల్పుల ఘటనలను జరిగినట్లు ఆ సంస్థ వెల్లడించింది. నలుగురు లేదా అంతకన్నా ఎక్కువ మంది కాల్పుల్లో మరణిస్తే ఆ ఘటనను సామూహిక కాల్పుల ఘటనగా గుర్తిస్తారు. గన్ వాయిలెన్స్ ఆర్కివ్ ప్రకారం అమెరికాలో 2021 సంవత్సరంలో 693 సామూహిక కాల్పుల ఘటనలు జరిగాయి. 2020లో సుమారు 611 కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి.

పిల్లలను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి : మంత్రి తలసాని

హైదరాబాద్, మే 25: పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలని, అప్పుడే వారు మరింత ఉన్నతంగా రాణిస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తల్లిదండ్రులకు సూచించారు. సైదాబాద్‌కు చెందిన న్యాయవాది ఫసియోద్దిన్ ఇద్దరు కుమార్తెలు ఉమైమా పాతిమా, సుమమ పాతిమా ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరిగిన నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కుమార్తెలతో కలిసి ఫసియోద్దీన్ మంత్రి తలసానిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంట చిన్న వయసులోనే నేషనల్ జాతీయస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించడం చిన్నారుల పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమన్నారు. పతకాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. మరింత రాణించేందుకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

ఏసీబీ వలలో శంషాబాద్ ఎఫ్ఆర్‌వో

హైదరాబాద్, మే 25:రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అటవీ అధికారి శ్యామ్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఎఫ్ఆర్‌వోతో పాటు విరియా నాయక్ అనే వ్యక్తిని సైతం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. టింబర్ డిపో అనుమతి కోసం రూ.80 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ఎఫ్ఆర్‌వో అవినీతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. శంషాబాద్ ఎఫ్ఆర్‌వో శ్యామ్ కార్యాలయంతో పాటు నివాసంలో అధికారులు సోదాలు నిర్వహించారు. శంషాబాద్ కోత్వాల్‌గూడలో టింబర్ డిపో అనుమతి కోసం లంచం అడుగుతున్నారని సికింద్రాబాద్ తార్నాకకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు అధికారులు ఎఫ్ఆర్‌వోను పట్టుకున్నారు.

కవుల





విరహ బాధలో
గుండె బరువు చూసా–
తడిసిన మోపు!
బాధల్ని ఊడ్చేసి
మళ్ళీ తూకం వేసా–
దూది పింజం రూపు!

–డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 26-5-2022



గుంపురాగం

గుంపుతో వస్తే
గుర్తింపు
ఒంటరిగా వస్తే
వేధింపు.

పోరు ప్రారంభించేది
ప్రజాపతులు
పాపఫలం అనుభవించేది
ప్రజలు.

అందుబాటులో ఉంటే
ఆదరణతక్కువ
ఇరుగుపొరుగు వారితో
వైరమెక్కువ.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

నెత్తుటి పాదాలతో కదం తొక్కిన సరికొండ కవితలు



సరికొండ నరసింహ రాజు పేరు చెప్పగానే నాగార్జునసాగర్ తళుక్కున మెరుస్తుంది. ఆ సుందర ప్రదేశానికి వెళ్ళిన సాహితీవేత్తలను అతని ఆత్మీయ ఆలింగనం మెత్తగా పలకరిస్తుంది. మన వెంటే వుండి అతను అందించే ఆతిథ్యం మరపు రాని అనుభూతుల్ని మిగులిస్తుంది. మంచి స్నేహితుడ్ని సంపాదించుకున్నామన్న తృప్తి కలుగుతుంది. ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే సరికొండ మంచి కవి మాత్రమే కాదు.. గొప్ప వ్యక్తిత్వం కూడా వున్న సహృదయుడు అని తెలియజేయడానికే.

వచన కవిత, దీర్ఘ కవిత, గేయం, పద్యం, లఘు కవిత వంటి వివిధ ప్రక్రియల్లో ఎనిమిది గ్రంథాలు వెలువరించిన సరికొండ తొమ్మిదవ పొత్తం 'నెత్తుటి పాదాలు'.

గత రెండు సంవత్సరాలుగా మహమ్మారి 'కరోనా' ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన భీభత్సం, అతలాకుతలమైన జనజీవనం, కొట్లాది బాధితులు, లక్షలాది మరణాలు, విధ్వంసమైన మానవీయ సంబంధాలు, మనం యింకా మరిచిపోనే లేదు. మళ్ళీ యిప్పుడు నాలుగో 'వేవ్' అంటు న్నారు. **'కరోనా'** నెత్తుటి పాదాల తడి యిప్పట్లో ఆరుతుందా అనే అను మానం పీడిస్తూనే వుంది. తల్లడిల్లిన మనస్సులతో కవుల కలాల నుండి కవిత్వం వెల్లువై ప్రవహించింది. సరికొండ కూడా దాదాపు ముప్పయికి పైగా కరోనాపై కవితలు రాసి మనకు అందిస్తున్నాడు. 'లాక్‌డౌన్' దృశ్యాలను మనముందుంచాడు. కరోనా గీతాసారాన్ని వినిపించాడు. వలస జీవుల నెత్తుటి పాదాల తడిలో కలాన్ని ముంచి కవితలల్లాడు. కష్ట కాలంలో బాధితుల్ని ఆదుకున్న 'సోనూసూద్'ను నెత్తికెత్తుకున్నాడు. వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసు యంత్రాంగం యిలా సేవలందించిన మానవతా మూర్తులందరినీ హీరోలను చేశాడు. కరోనా నుండి నేర్చుకోవాల్సిన పాఠాలను వల్లవేశాడు. కరోనా వైరాగ్యాన్ని ప్రవచిస్తున్నాడు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నాడు. 'కరోనా' ఎన్ని విపత్తులు సృష్టించినా చివరకు 'మనిషే విజేత' అని అభయమిస్తున్నాడు. చక్కటి పదబంధాలు, చిక్కటి భావచిత్రాలతో, తనదైన ప్రత్యేక అభివ్యక్తితో కవిత్వాన్ని కవిత్వంలా మనముందుంచాడు. కరోనా సెకండ్ వేవ్‌లో సరికొండ తన మాతృమూర్తిని పోగొట్టుకుని "అమ్మ చెట్టె మొలకెత్తెందుకు" అంటు రాసిన హృద్యమైన కవితను ప్రస్తావించకుండా వుండలేకపో తున్నాను.

"నేడు కరోనా సోకిన అమ్మ
ఆసుపత్రి గాజు గదిలో
బందీయైన నదిలా అమ్మ
కరోనా ముళ్ళ కంచెపై
ఆరేసిన గుడ్డలా పడివున్న అమ్మ
కనీసం అమ్మను తాకలేని అశక్తుడన్నై
కడసారి చూపుకు సైతం నోచుకోని శాపగ్రస్తుడిని" పై పంక్తులు చదివిన ప్రతిసారీ నాకు కన్నీళ్ళు ఆగలేదు. ఎన్ని తడవలు చదివానో లెక్కలేదు.

"అమ్మ పాడెను సైతం మోయలేని విధివంచితుడిని
నేడు అమ్మ తలవద్ద దీపాన్నైనా కాలేని పాపాత్ముడ్ని
నేడు చితిపైన వున్న, అమ్మ పార్థివ దేహానికి దహన సంస్కారం చేయలేని దరిద్రుడిని" యిది కవి ఒక్కడి స్వానుభవమే కాదు. బంధు మిత్రులను కరోనా కబళించిన సందర్భాల్లో అసంఖ్యాక అభాగ్యుల ఆక్రందన. కన్నీటితో తడిసిన కవితా పాదాలు, నెత్తుటి పాదాలుగా కవితను అల్లుకుని గుండెల్ని ద్రవింపజేస్తాయి.

"అమ్మ పాదముద్రల మట్టిలో కన్నీటి విత్తనమై
నన్ను నేను పాతుకుంటున్నాను
అమ్మ చెట్టునై మొలకెత్తేందుకు.." అన్న ముక్తాయింపుతో కవితను ముగిస్తాడు సరికొండ. గొప్ప 'ఎలిజీ'. దుఃఖాన్ని కవిత్వంలా ప్రవహింపజేస్తాడు.

'ఆకలి' గురించి రాస్తు

"ఆకలెప్పుడూ విశ్వ జనీన భాషే
దుఃఖ లిపిలో బతుకు ఘోషే
నేడు ఆకలి మాట్లాడితే
రహదారులపై నెత్తురువులివే
వలసకూలీల
పాదముద్రల్లా వుంది
అలుపెరుగని కర్షకుల శ్రామికుల
మహాపాదయాత్రలా వుంది"
అంటాడు. అనుభవంలోకి వస్తేనేగాని క్షుద్బాధను వ్యక్తీకరించలేం. కాని కవికి స్వానుభవం అక్కర్లేదు. పరాయి అనుభవం కూడా తన బాధలా చలించిపోతాడు.

"కలంతో సెల్ఫీ తీయడమే కదా.. కవిత్వం" అంటు కొత్త భాష్యాన్ని చెప్తాడు కవి.

అనునిత్యం ప్రొద్దునే వార్తాపత్రికలను అందించే 'పేపర్‌బాయ్' దిన చర్యలను ఏకరువు పెడ్తు "మన బాటలో వార్తల పూలు చల్లే అతడి కోసం.. పేపరు కొని చదవండి అంటాడు నిజమే. మనకు వార్తలు అందుతాయి. అతడికి ఉపాధి దక్కుతుంది. వార్తాపహులపై అనేక కవితలు వెలువడినై. వస్తువు పాతదేగా అని పాఠకుడు పెదవి విరిచేలోపు

"కవితా వస్తువు పాతదేకదా అన్నాడు ఓ కవి మిత్రుడు
ప్రతి ఉదయం పాతదే. కానీ నిత్యం సరికొత్త పాఠం
చెబుతుంది ఓ దినపత్రికలా అన్నాన్నేను" అంటున్నాడు సరికొండ. కవితా శక్తికి నూతన అభివ్యక్తి పూరిస్తే వస్తువెప్పుడు నిత్య నూతనమే అని కవి అభిప్రాయం.

"అతడు మట్టిలాంటోడు
చిన్న చినుకు విత్తితే చాలు
పంట చేలై పరవశిస్తాడు
అతడు నీటి లాంటోడు
మనిషితనపు ఆకుపచ్చని నదీ ప్రవహమై
బతుకులను సారావంతం చేస్తాడు"
ఎవరు అతడు? "తన గుండెలపై నాగలిజెండా లెగరేస్తూ కన్నీటి సాగు చేస్తున్న రైతన్న" కాదు.. కాదు "నాగలి మోసే సూరీడు"గా కర్షకుడ్ని అభివర్ణిస్తాడు.

పారిశుధ్య కార్మికురాలిని

"శ్రమ సౌందర్య పతాకై ఎగిరే విశ్వనాయకిగా పరిశుద్ధాత్మలో పరిమళించే దేవదూతగా" శ్లాఘించే ఈ కవి సమాజాన్ని ఎంతలోతుగా పరిశీలిస్తాడో అర్థం చేసుకోవచ్చు.

కవి తక్కువ తిన్నాడా? కలాన్ని పట్టిన కవిని

అవినీతి అక్రమాలను ఉద్ఘేపి
చైతన్యపు అక్షర జెండాలెగరేసే
పారిశుధ్య కార్మికుడిగా" దర్శించడం గొప్ప

ఉపమానం. చక్కటి సమన్వయం. మహోన్నత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను 'పాటల చనుబాలు'గా కీర్తిస్తు, దళితులకు, దరిద్రులకు వెలుతురు గొడుగు పట్టిన మహనీయుడుగా విశ్వకవి జాషువాను స్మరిస్తు, అద్దేపల్లి వారిని సాహితీ సమ్మోహనుడుగా గుర్తుచేస్తు, గుండెను, గుండె తడిని ప్రేమించిన ప్రముఖ రచయిత, పాత్రికేయుడు వాసిరెడ్డి వేణుగోపాల్ స్మృతిలో.. "మరణం" ఒక వైయక్తిక గీతిక, జగతి వేదికపై ఎగిరే జయపతాక'గా నివాళులర్పిస్తు, "నెత్తుటి నక్షత్రమై దారి చూపుతూ, అతడొక యుద్ధభూమిని సృష్టించాడు" అంటు విప్లవ కవి, మానవతావాది కలేకూరి ప్రసాద్ విశ్వరూ పాన్ని దర్శింజేస్తు సృజించిన స్మృతి కవితలు పాఠకుల గుండెల్ని తడి,తడిగా స్పృశిస్తాయి.

యిలా.. 'నెత్తుటి పాదాలు' పొత్తంలోని 77 కవితల్లో అసంఖ్యాక ఎంచదగిన, దాచుకోదగిన కవితా వాక్యాలు చక్కటి అనుభూతినిస్తాయి.

యిది వరలో సరికొండ నరసింహరాజు రాసిన "చూపుడు వేలుపై సూర్యోదయం' కవితా సంపుటిపై సమీక్షా వ్యాసం రాస్తు మున్ముందు గొప్ప కవిత్వాన్ని అందిస్తాడన్న నమ్మకం కలుగు తోందని అభిప్రాయపడ్డాను. 'నెత్తుటి పాదాల' వెంబడి నడి చింత ర్వాత నా నమ్మకం వమ్ముకాలేదనిపించింది.

ప్రతులకు: సరికొండ నరసింహరాజు
ఇ.నెం: ఎ-116, పైలాన్ కాలనీ
నాగార్జునసాగర్-508 203
సెల్: 94413 64022
9398234545

- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

నిట్టూర్పు

రోజూ భయంతో
భారంగా అడుగేస్తాడతను
నిన్న నిరాశపరిచిందంటాడు
నేడు ఆశను పరచలేదంటాడు
రేపు వంక చూడనంటాడు!

బతుకే అంత
సాఫీగా సాగే రహదారిలా
ఉండదంటే వినడే
అవరోహణల ఆరోహణల
రాగవిహంగమై పరుగుతీయటమే
అర్థం పరమార్థమని
చెప్పాలతనికి!

కలతలు కల్లోలాల
కొనఊపిరి
కొత్తేమీ కాదు అతనికి
మారాంచేసే మనసుకు
గారాంచేయటం నేర్పాలని
అతను నేర్చుకుంటే
రేపు వంక ఓర్పుతో చూస్తాడు!

సాధ్యాసాధ్యాలను కొలవటం కాదు
ధ్యాసను దైవంగా భావించి
ఆశను ధ్యానంగా చేసి
ప్రేమపాశంతో అతను
మనుషులను మనసులను బంధించగలిగితే
బతుకు ఆకలి తీర్చే మెతుకవుతందతనికి
బోధపడని ఈసత్యాన్ని
బోధించే బోధిసత్వుడు
అతనికి దొరికి బావుండన్న నిట్టూర్పు
నాలోంచి వెలువడింది!

-సి.యస్.రాంబాబు
8374818961

చిన్నారి ప్రశ్న?

ఓ బాలుడు నా దగ్గరికి వచ్చి
'నేను ఎందుకు పుట్టాను"
అని అడిగాడు
" ఇదిగో ఇందుకొరకే!" అన్నాను
ఆ పిల్లాడు నెత్తి గోక్కుటూ
"అర్థం కాలేదు" అన్నాడు అమాయకంగా..

"ప్రశ్న ఇప్పుడే కదా ఉదయించింది
అది ఇక నీ మెదడును తొలుస్తూ
ఉంటుందిలే" అన్నాను
"అవునా ఎన్నాళ్ళకు తెలుస్తుందో
ఏమో.." అన్నాడు
తన చేప కళ్లను మిటకరిస్తూ..

ఈ సంభాషణలో నిజానికి
నాకంటే ఆ చిరంజీవి గొప్పవాడు
ఎందుకంటే..
అతడికి చిరుత ప్రాయంలోనే
ఈ ప్రశ్న జనించింది
నాకేమో మధ్య వయసులో పుట్టింది.

ఇప్పుడు నేను
అతడికి సమాధానం
చెప్పకపోవడమే మంచిది
ఎందుకంటే..
నాకు తెలిసిన జవాబు చెబితే
అతడు ఆ చట్రంలోనే
ఇరుక్కుపోయి అక్కడే ఆగిపోతాడు

వాడిని అలా వదిలేస్తే..
నాలాంటి సగం మేధావులను
అడగడం మానుకొని
అనంత విశ్వంలోకి తొంగి చూస్తాడు.

అప్పుడు చిన్నారికి
పెద్ద సమాధానం దొరుకుతుంది!

-మౌనశ్రీ మల్లిక్
8919338546

ఆలోచిద్దాం !

లోకంలో ...
చల్లిన గింజలకు పక్షులు
చలాకి మగువలకు మృగాళ్ళు
తాయిలాలకు ఉద్యోగస్తులు
ఖాయిలాలకు పారిశ్రామికవేత్తలు
ఎరువులకు వ్యవసాయదారులు
ఉచితాలకు కళ్ళు తెరిచే ప్రజలు
తిండి తీర్థాలకు ఓటర్లు
బీరు బిర్యానీలకు యువకులు
సబ్సిడీలకు సామాన్యులు
తిండి దొరికితే చాలని అన్నీమరిచి
వెంటతిరిగే ఒళ్ళుపంచని సోమరులు
దోచుకోవడానికి దేశదిమ్మరులు
ఆలోచనల్ని కాల్చేసే ఆర్థిక నేరగాళ్ళు
నడిబజార్లో సోయిలేక , సిగ్గుమరిచి
మెదడు తాకట్టుపెట్టి ఏది చేయడానికైనా
సిద్ధంగా నగ్నంగా నిలబడ్డారు !!

స్వార్థానికి తాగుబోతులనుచేస్తూ
కాలమెల్లదీసే నాయకులు
పేదరికాన్ని కొనే రాజకీయాలు
అవసరాలను డబ్బుగా మార్చే
అవకాశవాద వ్యాపారులు
సమాజాన్ని కూల్చేస్తున్నారు
భవిష్యత్తును కాల్చేస్తున్నారు
రాజకీయ రాబంధులు
సంపదను స్వతాహాగా కొందరు
వారసత్వంగా మరికొందరు
తెలివితో దోపిడి చేస్తూనే ఉన్నారు !
అమ్ముడుపోయే ఓటర్లు
మోసాలు చూస్తూనే ఉన్నారు
కాలచక్రం నడుస్తూనే ఉంది !
కొత్తవింతలు పుడుతూనే ఉన్నవి !
ఏంచేద్దాం ? ఏది మారుద్దాం ?
వీటిలోఏది మారుద్దాం ?

గ్రామ నగర పట్టణాల్లో
ఈ నవీన సమాజ
నయవంచక లోకంలో
సందులలో పందులవలె
పెండలో పురుగులవలే
ప్రతీ పాన్ షాప్ దగ్గర
ప్రతీ కూడళ్ళ దగ్గర ,
ప్రతీ హోటళ్ళ దగ్గర
రాజకీయ అవినీతి రాక్షసుల దగ్గర
పంటపైబడే మిడతల దండువలే
కుప్పలు కుప్పలుగా వరదకుప్పుట్టే
కప్పల సంతతివలె , తెప్పలనిండా
నిండుకొన్నది చదువుకు దూరమైన
యువత అడుక్కుతినే అమాయకత్వం !

స్వార్థపు తల్లిదండ్రులిద్దరు
కోరికతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు
దారితప్పిన సంకర కణానికి పుట్టిన
నపుంసక నయవంచక క్రిములుగా
సమాజ విధ్వంసక సృష్టికర్తలుగా
అరాచకశక్తుల తుపాకీ తూటాలుగా
సంఘ వ్యతిరేక శక్తులుగా
ఎవరికి తోచినంత వారు
రసాయనాలకన్నా హీనంగా
కాలుష్యానికన్నా ఘోరంగా
సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారు !

ఉన్నోడు సదురుకునేలా
లేనోడు ముదురుకునేలా
ఉండిలేనోడు కసురుకునేలా
తెలివున్నోడు అవినీతిచేసేలా
అతి తెలివున్నోడు అందంగా
తయారై ఆర్థికసేరాలు చేసేలా
చదువుకున్నోడు స్మార్ట్ ఫోన్లు
ఇంటి ఆడవాళ్ళు ౨౮ సీరియల్లు
చదువుకున్నోడు స్మార్ట్ ఫోన్లు
మిగిలినవాళ్ళు సినిమాలు చూసేలా
సమయాన్ని ఆవిరిచేస్తూ ,
సమాజాన్ని మురికి కాలువచేసి
ప్రజలను జోకర్లవలె ఆడిస్తుంది
మీడియా అనే కొత్త లోకం !

ఇదే నేటి సమాజం !
ఇంకెక్కడి భావి భారత పౌరులు ?
ఇంకెక్కడి నిస్వార్థ దేశభక్తులు ?
ఇంకెక్కడి దేశరక్షణ ? సైనిక శిక్షణ ?
ఇంకెక్కడి సాంకేతిక నైపుణ్యం ?
ఇంకెక్కడి ఆర్థిక ప్రగతి !
ఇంకెక్కడి స్పైన్స్ పురోభివృద్ధి ?
అంతా తిరోగమన అధోగతి !
మన దమ్మంతా ఒకరిపై ఒకరు
దుమ్ము పోసుకోవడంతోనే సరిపోతుంది !

ఆలోచించాలి ! ఆలోచిద్దాం !
మనమే ఆలోచిద్దాం !
మళ్ళీ మళ్ళీ మరీ ఆలోచిద్దాం !
చదువుదాం ! ఇంకా చదువుదాం !
మనపిల్లల బంగారు భవిష్యత్తు
మనచేతుల్లోనే ఉంది ! అవును ...
కేవలం మనచేతుల్లోనే ఉంది !
చదువుతో రాజ్యాంగాన్ని
చేతిలోకి తీసుకొందాం !
భావిభారత పునర్వైభవాన్ని ,
స్వర్ణభారతాన్ని మళ్ళీ నిర్మించడానికి
మన పిల్లలకు సమయాన్నిద్దాం !
మార్గదర్శకులమై ,
మహర్షులమై రూపకర్తలమై
వెన్నంటి నిలుద్దాం !

- డా॥ డి. రాజేశ్,
9440460490

ఆడపిల్లలే నయం

లేచింది నిద్ర లేచింది
మహిళాలోకం
ఇది నిజమని నిరూపించింది
ఒక పదహారణాల తెలుగు తేజం
అమే నిఖత్ జైరీన్
పురుష ప్రపంచానికి చేసెను సవాల్
ప్రపంచ బాక్సింగ్ చాంపియన్
అవలీలగా గెలిచెన్

మన సంప్రదాయం
ఆడపిల్ల ఇంట్లో ఉండాలంది
వంటగదికే పరిమితం అంది
ఆడపిల్ల నాజూకుగా ఉండాలని అంది
బాక్సింగ్ ఆడవాళ్ల క్రీడ కాదంది

నిఖత్ నిరూపించింది
అమ్మాయా? మజాకా?
ఏ సవాలయిన సై అంది
శరీరాన్ని ఉక్కుముక్కలా మార్చింది
తిండి నిద్ర మానేసింది
శ్రమనే నమ్మింది
లోకం సహకారం లేకపోయినా
కన్నతండ్రి సహకారం కొండంత అండ
ఎగురవేసింది విజయకేతనం
మురిసిపోయింది తండ్రి అంతరంగం
వెలిగిపోయింది భారతమాత కీర్తి కిరీటం
నిఖత్ నీదే విజయం
ఆడపిల్లలే నయం

-అరుణ డేనియల్
9000606889

నీ విజయాలు అలై బలై లయ్యి

నాడు ఆంక్షల వలయం లో
తరాల పయనం
ఆడబిడ్డ గా కట్టుబాట్ల
గమనం
ఎన్ని కష్టాల సుడిగుండాలు
ఎన్ని ఆటంకాల అవమానాలు
ఆడ బిడ్డ గా కుమిలిన ఎన్ని
దుఖ్ఖ కాలాలు.

నేడు ఆడబిడ్డ
నడచిన తొవ్వల్లో
వికసించే విజయాల పుష్పాలు
మాటల్లో వెలిగే
వెన్నెల పున్నములు
ఆటల్లో మెరిసే
విజయ కిరీటాలు

ఆత్మ విశ్వాసమంత
గుండెల్లో నింపుకుని
ఆదర్శ కేతన మై
ఆడబిడ్డ
ప్రపంచమే గర్వపడే
ముద్దుబిడ్డ

ఓటముల పల్లవులు
అడుగడుగునా మోగినా
నిరాశాల చరణాలు
ప్రతిరోజూ వినపడినా
అడుగు వెనక పడలేదు
పట్టుదల చెదరలేదు
విశ్వాసం వీడలేదు
తపన మాది లొ తగ్గలేదు

కార్చిన చెమట బిందువులన్నీ
నేలపై పడలేదు

ఒక్కొక్క విజయమై
మెడలో హారాలయ్యాయి
శ్రమ అర్థాన్ని తెలిపి
అద్దమయ్యి మెరిశాయి

సాధించిన ఈ విజయం
ఇంటింటికి ఆదర్శం
సాధించిన ఈ విజయం
మనో ధైర్య విప్లవం
లక్ష్యమున్న ప్రతి గుండె లో
విశ్వాసపు చలనం

సాధన మెరిసే చోట
చెమటలు కురిసే చోట
పట్టుదలలు కలిసే చోట
లక్ష్యాలు పుడుతూ
ఊపిరయ్యే చోట

ఆశలతో మెరిసే కండ్లు
భవితను చూసే చోట

నీ విజయాలు
స్వాగత తోరణాలు కడతాయి
నీ విజయాలు
సగర్వమై సలాములు చేస్తాయి
నీ విజయాలు
అలై బలై లయ్యి
హత్తుకుని మెరుస్తాయి
(నిక్షత్ జరీన్ ప్రపంచ చాంపియన్
షిప్ సాధించిన సందర్భం గా)

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

పుస్తక సమీక్షలు

శివ మంచాల 'మౌనం మాట్లాడుతుంది' కవితా సంపుటి



మేధావి వర్గం, రైతు బతుకులు, ఒడుగు జీవుల బతుకుల పట్ల రాజకీయ సన్నాసుల నాటకం చూస్తూ కూడా మౌనంగా తలవంచుకు పోతుంటే, కలం అటువంటి వారిని మౌనం వదిలి మాట్లాడ మంటుందని దుష్ట పాలకుల పీడపట్ల తీవ్ర అసహనం, క్రోధం, బాధ వ్యక్తపరుస్తూ కవి శివమంచాల 'మౌనం మాట్లాడుతుంది' కవితా సంపుటిలో హెచ్చరించారు. మంచితనం, మానవత్వం కనుమరుగవుతున్న ప్రస్తుత కాలంలో అధర్మన్ని, అరాచకాన్ని ఎదిరించి ప్రశ్నించేతత్వం మేదావులు సైతం వదిలేసిన క్రమంలో, యువతరం సైతం కుహనా లౌకిక వాదానికి బానిసలుగా మారటంపై కవి 'శివ మంచాల' ధర్మాగ్రహం వ్యక్తం చేస్తారు. ఈ సంపుటిలో 69 కవితలున్నాయి. సమత, మమత, మానవతల సమ్మేళనంగా నిరుపేదల జీవితాలలో శ్రేయోదాయకమైన మార్పు అభిలషిస్తున్న కవి కనకపు సింహాసనాలపై కూర్చున్న శునకాలపట్ల 'శునకానందం' కవితలో ఆగ్రహం ప్రకటిస్తారు. ప్రజాపక్షం కవితలో

''కులపుతాల
కొమ్ములకు
కొందరు కవులు వెకిలి రంగు లేస్తుంటే..
మరికొందరు.. దగాకోరు రాజకీయాలకు
అమ్ముడుపోతూ అంగలార్చుకుంటున్నారు..!** అంటారు. అరాచకాల గుప్పిట్లో అమాయకత్వం ఎలా మోసపోతున్నదీ 'బలిపీఠం' కవితలో వివరిస్తూ తన కలం వేయ్యి దప్పు చప్పుళ్ళతో గర్జించే గళమై అమానుషత్వాన్ని ప్రశ్నిస్తుంది. న్యాయం కోసం నిజ నిర్ధారణ చేయమని ప్రభుత్వా లను నిలదీస్తుందంటారు. సంఘంలో మన చుట్టూ సంఘ టనలు కొన్నింటి స్పందనగా అక్షరాల అంతర్గత చైతన్యం మేల్కొని, మనుషుల మధ్య ఉండవలసిన ప్రేమ మమతానురాగాలు నిలబడటానికి కర్తవ్య నిర్వహణకు తపించి రాసిన కవిత్వమే ఈ సంపుటి. తన జీవితానుభవాలకు సంబంధించిన కవితలే కాకుండా, వైవిధ్య ఇతివృత్తాల పలు కవితలు ఇందులో ఉన్నాయి.

ఇపుడు ఎవరినీ నమ్మటానికి వీలులేదు.ఇక ఉంది నువ్వే

సమత, మమత, మానవతల సమ్మేళన మైన ఓ ప్రేమో! నువ్వు వర్ధిల్లు!' అంటారు శివమంచాల.

ప్రతులకు: కవన కిరణాలు
తెలుగు సాహితీ సమాఖ్య
ఇ.నెం. ఎస్-9, బ్లాక్ 27
రెండవ అంతస్థు,
హౌసింగ్ బోర్డు కాలనీ
దామినీడు, తిరుపతి,
ఆంధ్ర-517 501

-జయసూర్య
సెల్: 90149 48336/
9440664610

ఉత్తమ కవితా సంపుటి "ఉద్గీత"

-డా॥ కె.శివారెడ్డి



డా॥ వడ్డేపల్లి కృష్ణ రచించిన "ఉద్గీత" కవితా సంపుటి ఆవిష్కరణలో బైస దేవదాసు, డా॥ కె. శివారెడ్డి, ఆచార్య గౌరీశంకర్, డా॥ వడ్డేపల్లి క్రిష్ణ, డా॥అమ్మంగి వేణుగోపాల్, డా॥కాంచనపల్లి, బడేసాబ్. వడ్డేపల్లిని సత్కరిస్తున్న అతిథులు.

తెలంగాణ సాహిత్య అకాడమీ ఛాంబర్‌లో జరిగిన డా॥ వడ్డేపల్లి కృష్ణ రచించిన "ఉద్గీత" కవితా సంపుటి ఆవిష్కరణ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించిన ప్రసిద్ధ కవి డా॥కె.శివారెడ్డి "ఉద్గీత"ను ఉత్తమ కవితా సంపుటిగా పేర్కొన్నారు. 'ఉద్గీత' విశ్వ గీతలా అనేక ప్రాపంచిక విషయాల్ని స్పృశిస్తూ ప్రబోధభరితంగా ఉందన్నారు.

అధ్యక్షత వహించిన జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ "తెలంగాణ" గూర్చేగాక తేజాలైన దాశరథి, కాళోజి పి.వి. కొండా లక్ష్మణ్ బాపేజీ గూర్చి తనదైన శైలిలో కవితల్ని వడ్డేపల్లి తటిల్లతల్లా రచించి ఆకట్టుకున్నాడన్నారు.

ప్రభుత్వ "కాళోజి పురస్కార గ్రహిత" డా॥ అమ్మంగి వేణుగోపాల్ కావ్యాన్ని సమీక్షిస్తూ "ఉద్గీత" హృద్గీత'గా అందర్ని అలరించిన విధానాన్ని సోదాహరణంగా వివరించారు. సినారె అంతేవాసిగా అనేక గేయాల్ని, రూపకాల్ని రచించిన డా॥ వడ్డేపల్లి కృష్ణ వచన కవితల్లో అక్కడక్కడ లయాత్మకంగా ఎలా గేయా వర్ణపేయంగా కదను దొక్కిందో తెలియజేశారు. ఇటీవల ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనంలో తెలుగు కవిగా పాల్గొని చదివినట్టి వడ్డేపల్లి 'భారతభావన' ఖండికను ఉదాహరణంగా వినిపించారు. తద్వారా 'తంగేడు' పక్షపత్రిక సహ సంపాదకులైన డా॥ కాంచనపల్లి మాట్లాడుతూ "ప్రకృతి" ని గూడ మానవీకరణగా మలచి, అద్భుతమైన 'తూరుపుతల్లి" కవితను వడ్డేపల్లి వంటి పరిణత కవులు మాత్రమే రచించగలరని " ఆ కవితను చదివి రంజింపజేశారు.

ఆ తర్వాత "నేటినిజం" సంపాదకులైన బైస దేవదాసు మాట్లాడుతూ "సామాన్యులకు సైతం అర్థమయ్యేలా సరళ సుందరంగా రచించడమేగాక బాల సాహిత్యాన్ని కూడ సఫలీకృతులు చేసిన ఘనత వడ్డేపల్లిదని ప్రస్తుతించారు.

'సత్కళాభారతి' సత్యనారాయణ రచయితను శాలువాతో సత్కరించారు. చివరకు డా॥వడ్డేపల్లి స్పందిస్తూ 52 సంవత్సరాలుగా రచనలు చేస్తూ, సాహిత్యంలో తనదంటూ ప్రత్యేక లలిత గీతాలు, రూపకాల ముద్రల్ని వేయగలిగానంటూ దాశరథి-సినారె గార్ల స్ఫూర్తితో ప్రపంచ ఖ్యాతిగాంచినట్లుగా విన్నవించారు.

కల్పవృక్షపు నీడ

తనకు ప్రతిరూపమైన..
అమ్మ అనే కల్పవృక్షాన్ని
భువి పై సృష్టించాడు దైవం..
అమ్మ అనురాగపు నీడలోనే
సేదదీరును.. విశ్వ జన జీవనం..!!

మనసు పాడై మోడుగా..
మారినా..మలయ మారుతాన్నే
ఇలపై.. వీయిస్తుంది..
కుటుంబ వృక్షానికి తల్లి వేరై నిలచి
పిల్ల వేర్ల శాఖోపశాఖల.. బంగారు
భవిష్యత్తు కై అధః పాతాళమైనా
ఆనందనందన వనమని తలుస్తుంది..!!

జీవితారణ్యంలో ఎదురయ్యే
సుడిగాలులకు.. తాను
తాటి చెట్టు లా దీటుగా నిలబడి..
తనవారికి ముద్దు మురిపాల పచ్చల
పందిళ్ళ..శీతలాన్ని..పంచుతుంది..
మధుర ఫలాలనే..అందిస్తుంది..!!

అవనిపై 'అమ్మ' సృజన చూసి
అబ్బురపడిన పరమాత్మ..
అవతారాల నెపంతో...
గర్భకుహరాన గరిమతో మెదిలి
పొత్తిళ్ళ పసిపాప గా పరవశమొంది
బాల లీలలతో...అమ్మ ఒడిలో..
ముద్దు మురిపాల ముచ్చట్లు..
నింపి తరించాడు..!!

అమ్మ తనపు కల్పవృక్షపు నీడ
కరిగిపోకుండా ఒడిసిపట్టుకుని..
ఆదరించుటే మన కర్తవ్యమని..
ఆర్తిగాపలికాడు..!!

-సావిత్రి రంజోల్కర్
9833497812.

కర్షకులు తప్పదాయే కష్టము

కుగ్రామాలలో నేటికి
చెలిమ నీరే దిక్కవుతుండెను..!
ప్రభుత్వాలెన్నో మారిన
వారి బతుకులు మారకుండెను..!!

ఓటు అడుగనీకి వచ్చినపుడు
హామీలెన్నో చేస్తుంటారు..!
ఓటు వేపించుకున్నాక
అటువైపు అడుగేయకున్నరు..!!

వాగ్దానాల పేరుతోడ
ఆడుకుంటున్నరు పేదలను..!
తీర్పేటి సమయమచ్చినపుడు
తిప్పేస్తున్నరు ముఖములను..!!

ఏ కాలము ఎదురోచ్చినా
వెళ్ళక తప్పదు చెలిమె నీటికి.!
ఏ పార్టీ పాలన చేసినా
కష్టం తీరకుండె పేదలకి..!!

ప్రజాస్వామ్య పాలన దేశాన
అంచుకైన కానరాకుండెను..!
దోచుకొని తినుటకు మరిగిన
నాయకులు పాలన చేస్తుండెను..!!

వీళ్ళు ఏలినంత కాలము
ఊళ్లు బాగావవని తెలుసుకో..!
ఏళ్ళు గడిచిపోతున్నాను
నీళ్లు దొరకవని గుర్తుంచుకో..!!

మానండి ఓ పాలకులారా
దోచుకొని తినుటను ఆపండి..!
ప్రజల వద్దకు పరుగున చేరి
తగు అవసరాలు కల్పించండి..!!

-పసుల.శంకర్
9542181301

మౌనం

మనిషీ మనిషీ మాట్లాడితే
మాట అవుతుంది!
మనసూ మనసూ మాట్లాడుకుంటే
మౌనం అవుతుంది!!

శబ్దం అవసరము కావచ్చు
నిశబ్దం అద్భుతమవుతుంది!!
పరిచయానికి మాటలు అక్కర్లేదు
చిన్న చిరునవ్వు చాలు!!

మాట తూట అవుతే.....
మౌనం
మందు గుండును దాచుకున్న ఫిరంగి!
నిశబ్దం
శబ్దాన్ని తనలో దాచుకున్న
నిండుతనం!!
మాట .....
మనిషి భాష!
మౌనం ....
మనసు భాష!!

-జగ్గయ్య.జి
9849525802

పరోపకారం

మాటలురాని చెట్లు.....
కోరిన వారందరికీ
నీడను పండ్లను అందజేస్తున్నాయి,
మేఘాలు జలధారనుకురిపిస్తూ
ప్రాణికోటి దాహార్తిని తీరుస్తున్నాయి,
మాటలురాని గోవులు
మధురమైన క్షీరమిస్తున్నాయి,
పరోపకారం కోసమే నదులు,
వాగులు,వరవళ్లు తొక్కుతూ
తమ త్యాగభావాన్ని నిరూపిస్తున్నాయి
కానీ మనిషి మాత్రం స్వార్థబుద్ధితో
అన్ని సంపదలూ కేవలం తనవిగా
భావిస్తూ జీవకోటిని
అధఃపాతాళానికి నెట్టాలనుకుంటాడు
పరులను హింసిస్తూ
మనోవ్యధకు గురిచేస్తున్నాడు
పరులను నిందల పాలుజేస్తున్నాడు
పరుల ఆస్తులను దోచుకొని
గొప్పగాబ్రతికేయాలనుకుంటాడు
మిత్రమా-నువ్వెంత గొప్పగా
బ్రతికావన్నది కాదు ముఖ్యం
నువ్వెంతమందిని
బ్రతికించావన్నది కావాలి"

-రాయవరపు సరస్వతి
7989665525

అసూయ (కథ)

అడవికి రాజైన సింహానికి సలహాలను ఇచ్చే ఒక కుందేలును చూసి ఆ సింహం దగ్గర ఉండే నక్కకు అసూయ కలిగింది. కుందేలును, సింహాన్ని వేరు చేయాలని అది భావించింది. వెంటనే అది కుందేలు లేని సమయంలో సింహంతో "మృగరాజా!మీ గురించి ఆ కుందేలు చాలా నీచంగా మాట్లాడుతున్నది. మీరు అది ఏది చెబితే అది చేస్తారట. నిజానికి రాజు అదేనట. కేవలం పేరుకు మాత్రమే మీరు రాజట" అని దానికి ఉన్నవి, లేనివి దానిపై కల్పించి చెప్పింది. ఆ మాటలు విన్న సింహానికి కోపం వచ్చి "కుందేలు ఇక్కడకు రానీ! దాని సంగతి చెబుతాను" అని అంది.

ఆ తర్వాత అది కుందేలును కలిసి " కుందేలా!సింహం నీ మీద చాలా కోపంగా ఉంది . నీవు కనబడితే చాలు అది నిన్ను చంపేస్తుందట "అని చెప్పింది .అప్పుడు కుందేలు" సింహానికి నాపై అకారణంగా కోపం ఎందుకు వచ్చింది?" అని అది నక్కను అడిగింది. కానీ నక్క

" ఏమో నాకేం తెలుసు"? అని తప్పించుకొంది.

కుందేలు వెంటనే ధైర్యంతో సింహం వద్దకు బయలుదేరింది .దాన్ని దూరం నుండే చూసిన సింహం

" కుందేలా రా!నీ సంగతి చెబుతాను" అని కోపంగా అంది. కుందేలు దూరం నుండే దానికి చేతులు జోడించి నమస్కరిస్తూ "మృగరాజా !మీకు ఎవరో నాపై లేనిపోనివి కల్పించి చెప్పినట్లు ఉన్నారు. నేను మిమ్మల్ని ఏమీ అనలేదు .మీరే నాపై చాలా కోపంగా ఉన్నారని, నన్ను అకారణంగా తిడుతున్నారని ఆ నక్కనే నాకు చెప్పింది "అని అంది. ఆ మాటలు విని సింహం శాంతించి "ఈ అడవికి రాజువు నీవేనట.నేను పేరుకు మాత్రమే రాజునట " అని అది నక్క అన్న మాటలను ఉన్నదున్నట్లు చెప్పింది . అప్పుడు కుందేలు తానేమీ అలా అనలేదని తెలిపింది. వెంటనే సింహం కోపంతో " నక్క ఇక్కడకు రానీ! అది మన ఆత్మీయత ఓర్వలేక అసూయతో ఇలా ఇద్దరి మధ్యన చిచ్చు పెట్టాలని చూస్తున్నది "అని అంది .

సింహాన్ని కుందేలును దూరం నుండే చూసిన నక్క' బ్రతుకు జీవుడా' అంటూ మరో అడవికి పారిపోయింది .అది పారిపోవడం దూరం నుండే చూసిన సింహం, కుందేలు నవ్వుకున్నాయి.అందుకే ఇతరులు మన గురించి చెప్పిన అబద్ధపు మాటలు విని నిజమో,కాదో నిర్ధారణ చేసుకోవాలి తప్ప తొందరపడి అవే నిజమనుకోగూడదు.

-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535.

చెమట చుక్కల వాసన "వెలుగుపూలు"

అక్షరాన్ని ఆయుధంగా మలిచిన వాడు, అక్షరాన్ని ఒక ఫిరంగి గుండుగా పేల్చిన వాడు, సాహిత్యంలోకి చైతన్య కిరణాలు ప్రచురించిన మిత్రుడు తాటిపాముల రమేష్ గారు. తన తొలి కవితా సంపుటి" "వెలుగుపూలు"తో బలమైన గొంతుకతో మన ముందుకు వచ్చారు. నిండైన ఆత్మవిశ్వాసం ,బలమైన భావోద్వేగం తెలంగాణ యాస ,భాష పట్ల మమకారం, చూసిన కంటితో రాసిన కవిత్వం ఇది.

'వెలుగు 'జ్ఞానానికి ,చైతన్యానికి గుర్తులు .'పూలు' ప్రకృతిలోని సహజత్వానికి,మనసులోని పరిపూర్ణతకు ప్రతీకలు. 53 కవితలున్న ఈ గ్రంథం రమేష్ సంఘర్షణ నుండి ఉద్భవించిన భావతరంగాల ప్రతిబింబాలు. ఈ పుస్తకంలో వెలుగు పూలను తల్లిదండ్రుల ఆత్మీయతకు, భార్యపై ప్రేమకు, శ్రమైక జీవన సౌందర్యానికి ,సాంఘిక చైతన్యానికి, సామాజిక స్పృహ అన్వయించి కవిత్వీకరించారు.

ఈ కవితా సంపుటి ప్రారంభంలోనే మనసు గిటారు మీటింది నా ఎదని పొక్కిలి చేసింది పాదరసంలా జారిపోకు వంటి కవితా శీర్షికలతో తొలి ప్రేమ మాధుర్యం నుంచి ప్రణయాన్ని కొత్త బావ ప్రతీకలతో మనసును హత్తుకునే విధంగా ఉంటాయి.

పచ్చి కొమ్మను మెలి పెట్టినట్లు/నా మనసుని మెలిపెట్టి ఉంది .ఒక అమ్మాయి తన మనసును మెలి పెట్టింది. అది పచ్చి కొమ్మను మెలి పెట్టినట్లు మనసు కడలిలో ఆటుపోట్లు రేపి మనసును కదిలించింది అని హృద్యంగా చెబుతాడు .పెదాల పర్వతాలపై నుండి /జారిన మాటలు/ నా తనువు పుష్పం పై/ భ్రమరంలా వాలిపో అంటాడు . అంతటితో ఆగిపోక నా ఊపిరి గాలి పటం నీ తనువు కొమ్మ కు చిక్కుకోవడం, నా గుండె కాయ , నీ ముక్కుకున్న ముక్కెరకు తట్టుకోవడం, మాటల మధుర గుళికలు మనసుపై విసిరి కనురెప్పల కౌగిలిలో బంధించబడ్డ ప్రియుడి భాదను అంతరంగ తన్మయ త్వాన్ని విప్పి చెబుతాడు. ఆ ప్రేయసికి చిరకాలం కంటిపాపలా కాపాడుకుంటా. అని కంటిలో ప్రతిబింబమై నిలిచి పోతాను అంటాడు. మరో కవిత 'ఎదను ఎండిన ఎడారి చేయకు' అంటూ దేవకన్య లా కనబడిన ప్రేయసి చూపుల వలలో చిక్కుకున్న ప్రియుడు సాగరంలో మునిగిన



ప్రేమ ను ముసిముసి నవ్వులతో శరీరాన్ని ప్రకృతి లా పరవశింప చేసింది అంటాడు .అందం లేదని చదువు లేదని చులకనగా చూడకు అనీ మోర పెట్టుకుంటాడు, రైలు పట్టాలాగా కాకుండా జీవనదిలా మనం ఇద్దరం కలిసి ప్రయాణం చేద్దామని వాగ్దానం చేస్తాడు.

'నా మనసు కడలిలో సునామీ సృష్టించింది' అనే కవితలో స్వచ్ఛమైన ప్రణయం తొలి సంబరం ఎంత బాగా ఉంటుందో తెలుపుతాడు ,'ప్రేమ పక్షులను బ్రతకనిద్దాం 'అనే కవితలో పువ్వు వికసించినా అంత సహజంగా ప్రేమ వికసిస్తుంది సమాజంలోని కుల మతాల కారణంగా పరువు హత్యలు జరుగుతున్నాయి. కంప్యూటర్ యుగంలో కూడా ఈ పాశవిక చర్యలను ఖండించి ప్రేమను బతికిద్దాం. ప్రేమపక్షులు స్వేచ్ఛగా ఎగరనిద్దాం అంటూ నిలదీస్తాడు.

మాటల మధుర బంతులను విసిరి మనసు పొరల్లో పెనవేసుకున్న అర్ధనారి తన జీవిత భాగస్వామి గురించి ఎదపై గువ్వలా వాలి సప్తపదులు నడిచింది అంటాడు. ధనలక్ష్మీ దరిచేరి కనక వర్షం కురిపించింది అంటాడు.

కవి అమ్మలో పరమాత్మను చూసుకుంటాడు.రక్తాన్ని పాలుగా మార్చిన అమ్మ మాటలకందని మహాకావ్యం ,సృష్టికి మూలాధారం అమ్మే నని అమ్మ కడుపు తీపి ని అక్షరీకరించాడు. చిన్ననాటి నుండి నాన్నను గమనిస్తూ చెమట బిందువుల త్యాగాలను ఆకలింపు చేసుకుని నాన్న గుండె ధైర్యాన్ని త్యాగశీలి తను కొనియాడుతూ మా నాన్నే నా రోల్ మోడల్ అంటాడు.

స్వతహాగా ఉపాధ్యాయుడైన రమేష్ పిల్లల పట్ల అమితమైన ప్రేమను ప్రకటిస్తాడు. నవ్వుల నెలవంకలు రేపటి భావి భారత నిర్మాతలు జాతి మురిసిపోయే అగ్గిపిడుగులు జ్ఞానాన్ని వెదజల్లే పరిమళాలు అని మురిసిపోతాడు, కరోనా విలయతాండవం లో పాఠశాలలు మూతపడి పిల్లలందరూ ఇళ్ల కే పరిమితమై బోసిపోయిన పాఠశాలను చూసి బాధపడతాడు. కరోనా అనంతరం పాఠశాలలు తెరుచుకోగానే పిల్లలందరూ పాఠశాలకు రావడంతో గేట్లన్ని తెరుచుకొని స్వాగత తోరణాలుగా ఆహ్వానం పలకడం పక్షులన్నీ ఏకమై పిల్లలతో జాతీయగీతం బృందగానం చేయడం, మైదానమంతా పిల్లల పాదాలు తాకిడితో మురిసిపోవడం మురిపంగా కవిత్వీకరించారు ,ఆ తర్వాత సామాజిక సమస్యలు కరోనా వల్ల ప్రజలు పడిన ఇబ్బందులు బాధలు రాజకీయ వ్యవస్థలోని ప్లాస్టిక్ నవ్వుల రహస్యాన్ని విప్పి చెబుతాడు, ఈ దేశానికి ఆయువు పట్టు లాంటి యువత మత్తు మందుకు బానిస కావడం డ్రగ్స్ ,హెరాయిన్, గంజాయ్ వంటి మత్తు పదార్థాల వల్ల జీవితం నాశనం అయిపోతుంది అని ఆవేదన చెందుతాడు,' తరువు' కవిత ఖండికలో చెట్టు యొక్క ప్రాధాన్యతను మన కళ్ళ ముందుంచుతాడు.

'అంబేద్కర్ మహాశయుడు' 'చెదును చెరిపేద్దాం 'ఊరి చివర గుడిసెలు" నేటి మగువ' అనే కవితా ఖండికలో భారతదేశంలో స్వేచ్ఛ , సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రబోధించి దేశానికి మార్గదర్శి లైనా అంబేద్కర్ మహానీయుడి జయంతులు, వర్ధంతులు జరుపుకోవడం వదిలి వేయడం కాదు ప్రతి గుండెలో అనునిత్యం అతని ఆదర్శాల తో జీవించాలని ప్రబోధిస్తాడు. భారతదేశంలో వేళ్ళూను కొని పోయిన మనువాద సిద్ధాంతాన్ని కూకటివేళ్లతో పెకలించాలని స్వార్థపరులు సోమరిపోతులు కుల వ్యవస్థను కాపాడుకుంటారని, సమాజంలో అలాంటి కలుపు మొక్కలను ఏరి పారెయ్యాలి అంటాడు. ప్రస్తుతం రాజ్యాంగం మార్చాలనే చర్చ చేసే వాళ్ళకి రాజ్యాంగానికి తూట్లు పొడవడం మానేయాలని హెచ్చరిస్తాడు, భారత రాజ్యాంగం చేసిన శాసనాలు చట్టాల పట్ల గౌరవం లేకపోవడం కుల వ్యవస్థ ను కాపాడే వాడే చేస్తారని అంటాడు. రాజ్యాంగానికి పునాది సమానత్వం .కుల వ్యవస్థకు పునాది అసమానత్వం. రాజ్యాంగం మానవ నిర్మితమైనది. కుల వ్యవస్థ దేవుళ్ల ద్వారా నిర్మించారని చెబుతారు. రాజ్యాంగం ప్రజాస్వామ్యాన్ని కాంక్షిస్తుంది. కుల వ్యవస్థ నియంతృత్వాన్ని పోషిస్తుంది.రాజ్యాంగం అన్ని మతాల వాళ్ల కి ఆచరించదగ్గ గ్రంథం. కుల వ్యవస్థను కాపాడుకోవాలనే వారే రాజ్యాంగం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేయడం,వక్రీకరించడం,నిర్వీర్యం చేయడం వీళ్ళు పనిగా పెట్టుకున్నారు. ఇలాంటి వారిని తీక్షణంగా గమనించవలసిన అవసరం ఉంది అంటారు. 'చరవాణి' కవితలు సెల్ ఫోన్ల వలన పిల్లలు యువత అశ్లీలత ఆదరించే స్థాయికి వచ్చారని వారిని కనిపెట్టుకుని ఉండాలంటారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలు ఖండించాలి అంటారు. సూర్యుని నిద్రలేపే అడ్డా కూలీల దుఃఖాన్ని తెలుపుతారు.

ఇంకా వృద్ధుల సమస్యను ,పంటలు పండించే రైతుల సమస్యలను,తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం కోసం అసువులు బాసిన అమరులను తలుచుకుంటారు, తెలంగాణ ఉద్యమానికి బాటలు వేసిన తెలంగాణ సిద్ధాంతకర్త డాక్టర్ జయశంకర్‌గారిని, కొండా లక్ష్మణ్ బాపూజీ గారిని తలుచుకుంటారు.

కవి రమేష్ ప్రతి కవితలో ప్రారంభంలో సమస్యను కవితాత్మకంగా చెప్పుకుంటూ చివరిలో పాఠకుడికి పదునైన ప్రశ్నలు వేస్తారు మరి కొన్ని కవితలు సమాధానాలు ఉంటాయి కవికి పాఠకునికి మధ్య నిరంతరం ఆలోచనల ప్రవాహం సాగుతుంది. ఈ గ్రంథానికి 'వెలుగు పూల పరిమళం' అనే ముందుమాట రమేష్ యొక్క అంతరంగాన్ని పట్టి చూపించారు సాహితీ ప్రపూర్ణ ఆచార్య బన్న ఐలయ్యగారు , నిజాయితీతో కూడుకున్న ప్రజా పక్షం కవిత్వమని ప్రముఖ కవి రామా చంద్రమౌళి గారు, మలినం అంటని కవిత్వమని సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్ గారు ముందు మాటలు ఈ గ్రంథాన్ని ఆసాంతం చదవడానికి ఉపయోగపడతాయి.

- డా. కర్రెసదాశివ్
9949424726

గజేంద్రమోక్షం డా॥ దాసరి పద్యమాలిక

డా॥ దాసరి శ్రీనాథ్‌గౌడ్ రచించిన ఆటవెలది పద్య మాలికలో, గజేంద్ర మోక్షం శతకం, భగవద్భక్తి నిరూపణంగా పర్యావరణ పరిరక్షణ స్పృహ అంతర్లీనంగా సందేశం అందిస్తోంది. 113 పద్యాలలో కవి శ్రీనాథ్‌గౌడ్, అలవోకగా యతి ప్రాసల కోసం తడుముకొనే ప్రయాస లేకుండా, గజేంద్రమోక్షం కథ నడిపించారు. గజేంద్రమోక్షం అనగానే, మహాకవి పోతన పద్యాలు గుర్తుకు రావటం సహజం.

"అనువుగాని చోట నధికుల మన రాదు
తనది గాని చోట తగువువలదు"
అంటూ సందేశాత్మకంగా, భుజబలం పున్నా మదగజానికి బుద్ధిబలం లేకపోవడం వలన మకరినోట చిక్కిందని కవి పేర్కొంటారు. పోతన కవితా రీతిలోనే

"సిరికి జెప్పకుండ శ్రీనాథుడప్పుడు
ఆయుధమ్ము లేవి అందుకొనక
పక్షి నెక్కకుండ పరుగు పరుగునచ్చె
గజము ప్రాణములను గావగాను"
అంటూ శ్రీహరి ఆర్తత్రాణపరాయణతను దర్శింపచేస్తారు.

"ధనము కొరకు జనులు తపన పడగనేల
ధనము ఎంతయున్న తలచినపుడు
ధనము మోక్షమొసగ దగినది గాదులే
హరిని గొలుచు వారు హాయి నొంద్రు" అంటూ కవి హరిని కీర్తించే పద్యాలు రచించారు.

శతక రచనలో ప్రావీణ్యత సాధించిన కవిగా శ్రీనాథ్ సమర్థుడైన పద్యకవిగా గుర్తింపు పొందడానికి ఈ ఆటవెలది పద్యమాలిక రావడం అభినందనీయం.

ప్రతులకు: డా॥ దాసరి శ్రీనాథ్‌గౌడ్
1ఎ- 120/20, శ్రీనివాస గార్డెన్ ఎదురు రోడ్
ఆర్.ఆర్.నగర్,
తిమ్మాపూర్-504 209
మందమర్రి మండలం,
మంచిర్యాల జిల్లా. తెలంగాణ.
సెల్: 9701781696
7780143871

-జయసూర్య
సెల్: 9014948336
9440664610

ఆనందం వెల్లివిరియాలి

స్వార్థం మానుకో
సాయం పెంచుకో
సహనం పాటించు
ప్రశాంతతను సాధించు
ఆవేదనలు వదులుకో
అనురాగాలు పెంచుకో
ఆత్మీయతను పంచుకో
కోట్ల కోసం కుస్తీలు
ఆస్తుల కోసం ఆరాటాలు
అధికారం కోసం పోరాటాలు
క్రూరత్వం కుటిలత్వం
కుయుక్తులు కుట్రలు మానుకో
సిరిసంపదల కంటె
గుణ సంపద మనిషిని
మహోన్నతున్ని చేస్తుంది
విలువలే మనిషికి
నిజమైన ఆభరణాలు
భౌతిక సంపద కన్న
మానసిక సంపదే మిన్న
మనిషి విజ్ఞాని
మానసికంగా అజ్ఞాని
సంస్కారం లోపించి
సహనం నశించి
అహం ఆవరించి
ఆందోళన ఊబిలో
కూరుకుపోయి
ఆగమై ఒంటరైపోతున్నడు
ఆశలపై అదుపు
మమత మానవీయత
పరోపకారంభూతదయ
సమన్వయంసహకారం
సంఘీభావంజీవనశైలికావాలి
అసూయ వద్దు
అనురాగమే ముద్దు
సద్గుణాల వ్యక్తిత్వమే
అసలైన ఆనందానికి మూలం
ఆనందంధనసంపధ వల్ల రాదు
గుణసంపదవల్ల వస్తుంది
వ్యక్తిత్వంవికసిస్తే
ఆనందంవెల్లివిరుస్తుంది

-నేదునూరి కనకయ్య
9440245771

పుస్తక సమీక్షలు

కోకిలమ్మను కావ్యనాయికగా మలచిన 'మసన'!

కనుక బడకనీవు కమ్మని రాగమ్ము
చెవులలోన బడగ జేతువమ్మ
ఎంత ధనమునిచ్చి ఇట్టిగానామృత
మవనిలోన గ్రోల నలవి మాకు?
అంటూ కోకిలను కీర్తిస్తూ.. బహు గ్రంథకర్త, ప్రముఖ సాహితీవేత్త, ఆధ్యాత్మికవేత్త, ఆర్షకవి, ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు.. ఆచార్య మసన చెన్నప్ప 'వాన ప్రస్థం' అనేది జీవితం లో గొప్ప మలుపు.. ప్రతీ మనిషికీ మేలు కొలుపు అంటూ "కోకిల" పేరుతో ఓ పద్య కావ్యాన్ని వెలువరించారు. తమ జీవితాను భవాలను.. చేరుకున్న గమ్యాలను.. హృద్యం గా.. ఆలోచనామృతంగా ప్రతిబింబింప జేస్తూ.. 'వానప్రస్థ' జీవితానికి అద్దం పడుతూ.. వానప్రస్థం యొక్క ప్రాశస్త్యాన్ని.. కోకిలతో ముచ్చటిస్తూ రూపుదిద్దిన పద్యాలు గొప్ప సందేశాలనే మోసుకొచ్చాయి. ఆత్మాశ్రయ రీతికి ఆలవాలమై.. కోకిల స్వర మాధుర్య వర్ణనలతో సాగే ఇందలి రచన.. అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది.



లోగడ ఆచార్య మసన చెన్నప్ప ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా తాను చూసిన చిలకలను నేపథ్యంగా చేసుకుని.. "శుకోపనిషత్తు"లో ఆధునిక కాలంలో భార్యా భర్తలు ఎలా నడుచుకోవాలో చెప్పిన అనుభవం ఆయనకు ఉంది. ఇప్పుడు వానప్రస్థ ఆశ్రమం గురించి విడమరిచి చెబుతూ "కోకిల" కావ్యాన్ని తీర్చిదిద్దారు. ఆయన జీవిత భాగస్వామి శ్రీమతి ప్రేమీలగారు గూడువదలి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో చెన్నప్పగారు ఏకాకి అయిన నేపథ్యంలో.. తన వియోగ ఆర్తిని "ప్రమీలా త్రిశతి"గా విల పించి.. వినిపిం చారు. అలాంటి అవస్థలో హైదరాబా దులోని బోడుప్పల్ ప్రాంతంలో ఉదయనగర్ కాలనీలోని ఆయన కాలింగ్ బెల్లు కుంటిద యిందంటూ వాపోతు... కోకిల కూత అలారమయిందంటూ.. కోకిలతో తమ అనుభూతులను పంచుకుంటూ ఇందలి పద్యాలకు జీవం పోశారు.

లేదు భార్య నాకు లేపంగ పొద్దున
నీవే దిక్కువైతి నీరజాక్షి!
కమ్మనైన పాట నెమ్మదిగా దాకి
గుండెలోకి జారు గుమ్మరాణి! అంటూ తమ ఒంటరితనాన్ని మరిపించి.. పాటలతో మురిపించవచ్చిన కోకిలను ఉద్దేశించి అనేక అంశాలను ఇందులోని పద్యాల్లో నిక్షిప్తం చేసి కవి తమ భావుకతను ప్రదర్శించుకున్నారు.

మనుమరాళ్లుగలరు మసన చెన్నప్పకు
అందులో సుహాస్య అద్భుతముగ
కంఠమెత్తి పొడుకమ్మగా; కోకిలా!
నీదు దయగ దీనినే దలంతు" అంటూ మరో వ్యాసంలో శ్రావ్యంగా పాడే తమ మనుమరాలు సుహాస్యకు ప్రస్తావించారు.

పదుకొందువెపుడు? పర్యటింతువెపుడు?
కూతనేర్తువెపుడు? చూతువెపుడు?
కమ్మదనమునిండి కంఠంబులోనీవు
పాడుచుందువెపుడు? పలకవమ్మ" అంటూ కోకిల నేర్పరితనాన్ని ఈ పద్యంలో చెన్నప్పగారు ఆవిష్కరించారు.

"ఔను! బ్రహ్మచర్య మద్భుతముగ సాగె;
గార్హపత్యమందు గంటి సుఖము
ఇంక ప్రస్థమేతీరు గడుచునో
తెలియ జాలనమ్మ! తలిరుదిండి"
అంటూ రాబోయే వానప్రస్థాశ్రమం గురించి రాశారు.

బ్రహ్మచర్యమెంత బ్రహ్మాండమైనదో
దీక్షగొన్న నాకు తెలియనమ్మ!
విద్యలెల్ల నేర్చి వెల్గొందుటకుగాను
బ్రహ్మచర్యమొకటి 'ప్రథమ గురువు'
అంటూ బ్రహ్మచర్యమెంత గొప్పదో తెలియజెప్పారు.

"నాల్గు ఆశ్రమములు నరుడైనవానికి
అనుసరింప దగినవగును తల్లి!
దేన్ని బట్టుకున్న దాని ధర్మంబును
నిర్వహింప దగును నియమమెఱిగి'
అంటూ గుర్తు చేసిన తీరు బాగుంది. కోకిలమ్మను నాయికగా మలచి మసన చెన్నప్ప గారు రాసిన పద్యాలు ఆద్యంతం బాగున్నాయి.

'ఒక్కరోజు నీవు చక్కగా గళమెత్తి
పాడకుండ పాట వదలినావో
అన్నమే రుచింపదమ్మ! పనులుగుండ
చక్కబడవు, నిద్రసరిగ రాదు" అంటూ కోకిలమ్మతో పెనవేసుకున్న బంధాన్ని పై పద్యంలో చక్కగా వివరించారు.

గుక్కదిప్పుకోవు కూత గూయాలన్న
తీయదనము పరుగుదీయుచుండు;
అలసిపోని గొప్ప అనురాగ దేవత
వీవె కోకిలమ్మ! ఈ జగాన! అంటూ ప్రస్తుతించారు.

'నీవు పాడకుండ నేరుగా మధుమాస
మేగుదెంచి లాభమేమిటమ్మ!
చెట్లు చేమలెల్ల చిగురించు నీగాన
రవళి విన్నయంత, భువనమంత" అంటూ కోకిల రాగంతో ప్రకృతి.. జగమంతా పరవశిస్తుందన్న విషయాన్ని చక్కగా తెలియజెప్పారు.

'నీవు పాడలేని నిజమైన ఆరోజు
కోరజాలమెప్పుడు కోకిలమ్మ!
పస్తులుండమన్న పస్తులుంటముగాని
పాట వినక క్షణము బ్రతకలేము"
అంటూ కోకిల గానం పట్ల ఎంత అనురక్తిని పెంచుకున్నారో ఇట్టే అర్థమయ్యేలా పై పద్యాన్ని తీర్చి దిద్దారు.

'పలుక గలదు చిలుక, పాటపాడెద నీవు
ఎవరి గొప్ప వారిదీ జగాన;
వన్నెలాడి చిలుక వగలు పోవునుగాని
పగలు సెగలు లేనిపక్షినీవే!' అంటూ కోకిలను ఉన్నతంగా3 చిత్రించారు. వగలు. పగలు సెగలు వంటి పదబంధాలను, ఔచిత్యవంతంగా ప్రయోగించారు.

"మనసుమంచిదైన మాట మంచిదగును
మాట మంచిదైన, మనము సేయు
కర్మలు శుభదాయకమ్ములై వర్ధిల్లు
కోకిలమ్మ! తెలుసుకొంటినిట్టు" అంటూ రాసినపంక్తులు పైపద్యంలో సందేశాత్మకంగా కొలువుదీరాయి.

"నీవు చేయునట్టి నిజమైన కచ్చేరి
ఫీజులేక మాకు ప్రీతి గూర్చు
అమ్మ! ప్రకృతిలోన అద్భుత సంగీత
సభను జేయు నీకు సాటిలేరు" అంటూ కోకిలమ్మను కొనియాడారు.

గుండెరావు సహజ పాండిత్యమేనీవు
గోపదేవు జ్ఞాన దీపమీవు;
కవివి నీవు- పుణ్యకావ్యాత్మవే నీవు
ఋషివి నీవు, వేద ఋతము నీవు"
అంటూ కవి ఆచార్య మసన చెన్నప్పగారు గురువులను గుర్తుకు తెచ్చుకుని తమ ఉత్తమ సంస్కారాన్ని ప్రకటించుకున్నారు-

"కోకిలమ్మ నీదు కూత గొప్పదనము
చెప్పునట్టి వేళ స్నేహమలర
వెల్లడించినాను వేద సిద్ధాంతము
ఋషులు పలికినట్టి ఋతులు తెలిసి"
అంటూ కోకిలమ్మ గాన మాధుర్యంతో స్నేహభావన ఎలా పెనవేసుకుందో చక్కగా ఆవిష్కరించారు.

విధి నిర్ణయంతో ఒంటరివాడైన కవి ఆచార్య మసన చెన్నప్పగారు అనివార్యంగా వానప్రస్థంలోకి ప్రవేశించి.. వానప్రస్థాశ్రమాన్ని ధర్మబద్ధంగా కొనసాగించుటకు ఆధ్యాత్మిక భావనా తిలకాన్ని అద్దుకుని కొనసాగం అభినందనీయం. ఆదర్శప్రాయం.. కోకిలను సంబోధిస్తూ.. కోకిలతో ముచ్చటిస్తూ.. తమ జీవితానుభవాలను ఇందలి పద్యాల ద్వారా మనతో పంచుకోవడం స్వాగతించదగింది.

నీదు కూజితమ్ము నిజముగా నాకింత
సుఖము గూర్చునంచు చూడలేదు;
ఏది యెపుడు సంభవించిన సయ్యది
అచ్యుతుని యనుగ్రహించె తల్లి!
అంటూ కోకిలమ్మను ఉద్దేశిస్తూ కవి తమ తాత్వికతను చాటి చెప్పారు.

కోకిలమ్మను నాయికగా మలచి మూడు వందలకు పైగాపద్యాలను రాసి మెప్పించిన కవి ఆచార్య మసన చెన్నప్పగారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ప్రతులకు: ఆచార్య మసన చెన్నప్ప
9-76/2, ఉదయనగర్ కాలనీ
బోడుప్పల్,
హైదరాబాద్-92
సెల్: 9885654381

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

మానవా ! నువ్వు మారవా?

మనిషి పుట్టుకతోనే బ్రహ్మజ్ఞాని,
వాంఛల కంచెలను
కవచ కుండలాలుగా మార్చుకుని,
అజ్ఞానాన్ని అస్తిత్వంగా చేసుకుని,
కోరికల కర్మాగారంలో
ఆస్తులని కూడబెట్టుకుని,
ఆశల మంటలలో
అంతరాత్మని కాలబెట్టుకుని,
అసూయ ద్వేషాల కాల సర్పాలను
గొంతులో దాచుకుని,
అబద్ధాల మాటలని అస్త్రాలుగా సంధిస్తూ మోసం చేస్తూ,

చేదబావి

కొత్త కోడలు పిల్లలా
ఊరి జనం
నిద్రలేవక ముందే లేచి
బొట్టు బొట్టుగా
ఊరిన నీటినంతా పట్టుబట్టి
వేకువజామే వేడిచేసే
ఊడిగంలో పడేది
మా ఊరి చేదబావి.
రంగురంగుల రిబ్బన్లు లేకున్నా
అందంగా
జుట్టేసుకున్న అమ్మాయిలా
రెండు వైపులా
పిలకల్లాంటి గిలకలతో
లేత కొబ్బరిని పోలిన
తీయని నీటిని
మాకు పంచి పెడుతూ
ఎప్పుడూ కళకళలాడేది.
ఉత్తరాయణంలో
అడుగు పెట్టిన సూరీడు
ఉన్న నీళ్ళన్నీ తనే తాగిపోతాడని
చిన్నపిల్లాన్ని
తల్లి పాలు తాగమన్నట్టు
ఊరినవి ఊరినట్టు
పంతులు వంతులుగా
ఊరి జనాన్ని చేదనోటితో
తాగమని కోరేది.
పండగొచ్చినప్పుడల్లా
అలుకు సానిపికి
నీటి అవసరం ఎక్కువైతే
చేదతాడు రాపిడికి
అరచేతి మీద
ఎర్రటి బొబ్బల గులాబీలు
పూయించేది.
ఎండాకాలం ఎక్కడో
బావి అట్టడుగున పడిన నీటిపాపను
పైకి తీసే ప్రయత్నంలో
చేద శరీరానికి తియ్యని
గాయాలెన్నో చేసేది.
నీటికోసం నిద్రలేని రాత్రులు
గడిపినప్పుడు
నేను ముందంటే నేను ముందని
పోటీపడ్డ బిందెలు
పోగొట్టుకున్న అందానికి
కారణం నేనేనని కంటతడి పెట్టుకునేది.
తనవారు పెట్టే హింస
తట్టుకోలేని బొక్కెన
కట్టిన తాడును
పట్టుమని తెంచుకుని
వర్షాకాలం నీట మునిగితే
యజమాని ఎడబాటు చూడలేక
ఏడు కొండ్లున్న
పాతాళ గడియ ఎడమచేతికి పట్టిచ్చేది.
కొత్త కోడళ్ళను
అత్తలు పెట్టే ఆరళ్లు
భార్యను కొట్టే భర్తల
భాగవతాలు బయటపెట్టేది.
అంతేకాదండోయ్
అప్పుడప్పుడు
అత్తలకు మాటల కొరకంచులు పెట్టే
కోడళ్ళ పన్నాగాలు
భర్తలను గొడవకు
కర్తలను చేసే నాటకాలకు
తెరతీసే రంగస్థలమయ్యేది.
పొడవాటి జుట్టు ఉన్న పొలతి
జడను ముడేసుకున్నట్టు
ఎన్నో జ్ఞాపకాలను తన చుట్టూ
ముడేసుకున్నా....
తనకు నిజమైన నిఖార్సైన
గుర్తింపునిచ్చింది మాత్రం
పిల్లలు పుట్టినప్పుడు
బావికి తీసుకెళితే
బొట్టు పెట్టి పూజించిన
పచ్చి బాలెంతరాలే
ఇక ఇప్పుడైతే...
చేదబావి
మిగిలిపోయిన జ్ఞాపకాల
ఎండమావి
శిథిలమైనా చెదిరిపోని
గత స్మృతుల కథలు చెప్పే
నిండు మోవి.
ఎప్పటికీ
చేదబావి
అనుభవాలు పండిపోయి
ఆప్తవాక్యాలు పలికే
గుండెబావి

-కమలేశ్
9160396596

పుస్తక సమీక్ష

మూడు కోట్ల "తెలంగాణ వైభవం"

తెలంగాణ చారిత్రక సాంస్కృతిక రాజకీయ ప్రాధాన్యతను కళ్లముందు నిలిపే కవితలు చాలా ఉన్నాయి. "తెలంగాణ వైభవం" కవితా సంకలనం లోని కవితలన్నీ ద్రాక్ష పాకం లాగా సరళంగా ఉన్నాయి. ఇందులో మొత్తం 27 కవితలలో ప్రతి కవిత తెలంగాణ వైభవాన్ని చారిత్రక నేపథ్యాన్ని చాటిచెప్పేవే.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ప్రసిద్ధి .ఇలాంటి తెలంగాణలో రామప్ప దేవాలయం, బాసర సరస్వతి దేవి, సమ్మక్క సారక్క, ఏడుపాయల దుర్గ భవాని, మెదక్ చర్చి, గల గల పారే మంజీర నది, మూసి, కృష్ణ, గోదావరి నదులు, ఈ వీర తెలంగాణ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైనది. తెలంగాణ పోరుగడ్డ మతసామరస్యానికి ప్రతీక బతుకమ్మ ,పీర్ల పండుగ, ఎన్నో ప్రాజెక్టులు చారిత్రక కట్టడాలు ఎన్నో పర్యాటక ప్రాంతాలు తెలంగాణ వైభవాన్ని చాటి చెప్పడం మనందరి కనీస బాధ్యతగా భావించాలి.

తెలంగాణ వైభవం కవిత సంకలనంగా తీసుకురావాలనే ఆలోచన గొప్పది.

ప్రధాన సంపాదకులుగా పెందోట వెంకటేశ్వర్లు, సహ సంపాదకులుగా ఎర్రోజు వెంకటేశ్వర్లు వ్యయ ప్రయాసలకు ఓర్చి పుస్తక రూపకంగా తీసుకువచ్చారు. శ్రీవాణి సాహిత్య పరిషత్ , సిద్దిపేట వారి ఆధ్వర్యంలో పుస్తకాలను ప్రచారంలోకి తీసుకు వచ్చిన పెందోట వెంకటేశ్వర్లు గారు, మరొక ఆణిముత్యం లాంటి పుస్తకాన్ని కవితాసం కలనం గా తీసుకు రావడం అభినందనీయం.

నవాబు పాలనలో మగ్గేను తెలంగాణ అంటూ "బంగారు తెలంగాణ" కవితలు అమాయకత్వం అధికమై నవతెలంగాణ కవితలో వివరించారు. తెలంగాణ "వీరులకు కట్టాలి గుండెల్లో స్థూపం" అంటూ చక్కటి కవితను కవి గంగాపురం శ్రీనివాస్ గారు ఆవిష్కరించారు.

తెలంగాణలో ప్రత్యేకంగా కాకతీయులు / ఏలిన వరంగల్ జిల్లాలో ప్రపంచ/ యాత్ర స్థలాలలో ఒకటైన రామప్ప దేవాలయం అంటూ మరొక కవి తెలంగాణ యాత్ర స్థలాలు దేవాలయాల గురించి వివరించారు.

బహు భాషలు మాట్లాడగల దిట్టా/ తెలుగు సాహితీవేత్త /సినీ పాటల పుట్ట సినారె అంటూ

సినారె గురించి "సాహితీ పద్మ భూషణుడు" అనే కవితలో ఇంకొక కవి గళం ఎత్తాడు.

స్థానిక భాష కే పట్టం కట్టిన/ మహిమాన్విత విశ్వవిద్యాలయం/ సామాజిక ఉద్యమాల సెలిమ అంటూ "చదువుల ఉస్మానియా" కవిత లో పెందొట వెంకటేశ్వర్లు వివరిం చారు.

మా తెలంగాణ తల్లికి నాలుగు కోట్ల వందనాలు/ మా బంగారు తల్లికి బంతి పూల దండలు

అంటూ "తెలంగాణ తల్లి" కవిత లో వీరులను కన్నా తెలంగాణ తల్లి గురించి వర్ణించారు.

తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన "అమరులకు వందనాలు" కవిత లో అందుకోండి వందనాలు అమరవీరుల అంటూ మరో కవి వందనాలు సమర్పించారు.

ఈ తెలంగాణ కవిత వైభవంలో ప్రతి కవిత తెలంగాణ గొప్పతనాన్ని, నేపథ్యాన్ని, వైభవాన్ని చాటి చెప్పేవే. అతి తక్కువ కాలంలో ఈ కవితా సంకలనం ఈ పుస్తకం రూపంలోతీసుకు వచ్చిన సంపాదకులకు శతకోటి వందనాలు.

పుస్తకం ముఖ చిత్రం చాలా బాగుంది. తెలంగాణ తల్లి, తెలంగాణ చిత్రపటంతో అమరవీరుల స్మారక స్థూపం బోనాలతో ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది. డిటిపి శారద గ్రాఫిక్స్, మరియు ప్రింటర్స్ సిద్దిపేట చక్కగా చేశారు.

ప్రతులకు:శ్రీవాణి సాహిత్య పరిషత్తు
ఇంటి నెంబర్ 15 బి90
హనుమాన్ నగర్
సిద్దిపేట
9440524546

-యాడవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

నేల రాలని నక్షత్రాలు

రాత్రంతా నేల చూపులు చూస్తున్న నక్షత్రాలు
గమనిస్తున్నాయన్ని టెలిస్కోపు కళ్లతో
జంకుతున్నాయి కిందికి దిగి రావడానికి
కనీసం చుట్టం చూపుగా చూసిపోవడానికి
నీడనిచ్చే చెట్లను నరికే కుళ్లు కుతంత్రాలు
కుల మతాల కుచ్చుటోపీకి
పెరుగుతున్న విలువలు
మాటలు చేతల్లో చూపని
స్వార్థ రాజకీయాలు
అమాయకత్వం,
ఆడతనంపై పెరుగుతున్న అకృత్యాలు
చూసి చూసి చింతించి
ముక్కు చీదుతున్నాయి,
జడుసుకుంటున్నాయి

భువి నుండి దివికేగిన
నక్షత్రాల్లాంటి మనుషులు
మంచికి చెక్కిన శిల్పాలు,
త్యాగానికి రాలిన పూలు
మరో తరం చేరుకోవాల్సిన ఆదర్శాలు
చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకోలే
పదవులు, ప్రాణత్యాగాలు భావించాయి
గడ్డిపోచలా.

చిమ్మచీకట్లో ఉచిత
బహుమానాలు నక్షత్రాలు
మురిపిస్తాయి, ముచ్చట్లు చెప్తాయి
తలపైకెత్తితే తలుపులు తెరుస్తాయి
చందమామ ఉన్నా లేకున్నా
మారని నక్షత్రగతులు
ఊహల్లోకి దింపుకుంటే
కళ్ళలో కాంతులీనుతాయి.

ఉల్కలు నేలరాలితేనే భయకంపితులౌతాం
చూపులకు చంటిపాపలే నక్షత్రాలు
అవి ఎంత వెలుగుతుంటే
మెరుస్తూ కనిపిస్తాయి
నేల రాలితే ఎంత
ఉత్పాతమో, ఉపద్రవమో
వాటి స్థానంలో అవి,
మన స్థానంలో
మనం హాయి

-కొమురవెల్లి అంజయ్య
9848005676

ఒక్కొక్కటిగా.

సంపద మనసును
చీకటి చేసాక
మానవత్వ పుష్పాలు
వికసించడం లేదు.

స్వార్థం మనిషిని
కాటు వేశాక
మనసు సంఘర్షణ లో
మంచితనపు మధురిమలు
భరించనంత చేదు గయ్యాయి.

మనిషి రాక్షసత్వానికి
బానిసయ్యాక
మనసులన్నీ మోయ లేనంత
బరువులయ్యాయి.

రాజకీయం నిండా మోగుతున్న
స్వార్థ రెచ్చ గొట్టు మాటల్లో
అమాయక జనాల ఆశలన్నీ
ఒక్కొక్కటి గా కరుగుతున్నాయి

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

నువ్వేంచేస్తావో తెలియదుగానీ...

చీకటిప్పటికీ వర్షంలా కురుస్తోంది
మనిషినీ తడుపుతోంది
మనసునూ తడుపుతోంది.

పాడు చీకటి
ఇప్పుడప్పుడే పోయేలా లేదు
కరోనా కక్కిన చీకటి కదా!
అంత త్వరగా పోదులే.

కొక్కానికి
మౌనంగా వేలాడుతున్న తెల్ల చొక్కా
బల్లపై నిద్దరోతున్న కళ్ళజోడు
శవాసనమేసిన మడత మంచం
తడినికోల్పోయిన ఉత్తరం ముక్క
ఎటూ కదల్లేని చెప్పుల జత.
జ్ఞాపకాలుగా మారిపోయిన
ఆత్మీయులను గుర్తుచేస్తున్నాయి.

ఈ భయంకరమైన చీకట్లో
ప్రతి జ్ఞాపకం ఓ ముళ్ళై గుచ్చుకుంటోంది
ప్రతిక్షణం ఓ పామై తరుముతోంది.

సూర్యుణ్ని వేడుకుంటావో!
చంద్రుణ్ని కీర్తిస్తావో!
నువ్వేంచేస్తావో తెలియదుగానీ
ఓ కాలపు మంత్రదండమా !
కరోనా కక్కిన చీకటివర్షానికి
తడిసిముద్దైన ఇళ్ళల్లో కాస్త
ఆశాజ్యోతిని వెలిగించవూ...!!

- ఎన్.నరేశ్ చారి
9701334516

గెలుపు

(కథ)

అరగంట నించి గుడిసె ముందు దిగాలుగా కూచుండి గంటలమ్మ. నవ్వుకి మారు పేరుగానూ ఆవేదనకి ఆమడ దూరంగానూ ఉండే గంటలమ్మ మొహం ఇప్పుడెవరైనా చూస్తే పశ్చిమాన అస్తమిస్తూపోతున్న సూర్యుడు తూర్పు ముఖంగా కూర్చున్న ఆమె వెనుకనుండి ముందుకి ఒక తెరని చింతలతో అల్లిదింపినట్టు ఉంది.

గుడిసె ముందున్న పున్నాగపూల చెట్లు రాలుస్తున్న పూలు చిన్నబోతున్నాయి. చేతిలోకి ఒక్క పువ్వు కూడా గంటలమ్మ తీసుకోమని, రోజూ ఇన్నేసి పూలు ఏరి మురిసిపోతూ వాటిని చూసుకునే ఈమెకి ఈ రోజు ఏమయ్యిందని తెల్లరేకుల మొహాలతో పరిసరాలని తేలికపాటి పరిమళంతో నింపుతూ చూస్తున్నాయి.

మసక చీకట్లు కమ్ముకొస్తుంటే మరి తప్పదన్నట్టుగా శక్తినంతా కూడదీసుకుని లేచింది గంటలమ్మ కూర్చున్నచోటినించి.

పొయ్యి అంటించి ఎసరు పడేసింది. అది మరిగేలోగా బియ్యం చేటలో పోసి చెరుగుతుంటే చిన్నతనం గుర్తొచ్చింది. ఇంట్లోంచి చేటలు, జల్లెడలు తెచ్చి పెద్దా పేరక్కల్లా చెరుగుతున్నట్టు జల్లిస్తున్నట్టు నేస్తాలతో కలిసి ఆడుకున్న ఆటలు కళ్ళ ముందు కదిలి కాలం అక్కడే ఆగిపోకపోయిందా అన్న ఆలోచన మనసుని కుదిపేసింది.

అప్పుడప్పుడైనా చిన్నతనం మనసులో మెదలని మనిషే ఉండడేమో. ఔను కష్టాలు కడగళ్ళు పడిన బాల్యమైనా సరే తల్చుకున్నప్పుడు కళ్లనుండి కారేవి ఆనంద బాష్పాలంటుందేమో మనసు.

అందుకే కాబోలు గంటలమ్మ చెమ్మగిల్లిన కళ్ళు చిరునవ్వు చిత్రాన్ని పెదవుల మీద మెరిపించాయి. ఎసట్లో బియ్యం పోస్తుంటే గుమ్మంలో ఎవరో తచ్చాడు తున్నట్టనపించింది. వచ్చి చూసింది. ఇంకెవరు భీముడు.

"ఈడనే తిరుగుతున్నావేంది? లోపలి కొచ్చేది లేదా? కాల్చేతులు కడుక్కోనిరా. అన్నం తిందువు" అంటూ మళ్ళీ లోపలికి నడిచింది.

తల్లి మొహంలోకి చూడటానికి ఇబ్బందిగా అనిపించింది భీముడికి. అందుకే చూడకుండా మొహం పక్కకి తిప్పుకునే గుడిసె వెనకవైపుకి వెళ్ళాడు చుట్టు తిరిగి. గోలెంలో నీళ్ళు ముంచుకుని కాళ్ళూ చేతులూ కడుక్కు నొచ్చి కూర్చున్నాడు. పది నిమిషాల్లో కంచం పెట్టింది. కొడుకు అన్నం తినడం పూర్తయ్యే దాకా ఏమీ మాట్లాడలేదు గంటలమ్మ. రోజూ తినేటప్పుడు కాస్తయినా కబుర్లు చెప్పే భీముడు కూడా నోరు విప్పలేదు. ఇంక చివరికి తనే ఒక మాట మాట్లాడింది "మీ అయ్య రేపొద్దుటే వొస్తాడు ఊర్నించి" అని.

తను పనిచేసే యజమానితో కలిసి పనిమీద ఊరెళ్లాడు బాలయ్య పదిరోజుల కిందట.

అయ్య రేపొస్తాడు మంచినీళ్ళు తాగుతున్న భీముడికి పొలమారింది. కొడుకు నెత్తిమీద చిన్నగా తట్టింది గంటలమ్మ పైకి చూడమంది. తలెత్తి ఒకసారి పైకిచూసి దించుకునేటప్పుడు అమ్మ మొహంలోకి భయం భయంగా చూశాడు. ఆశ్చర్యంగా అనిపించింది. అమ్మ మొహంలో కోపం కనిపించటం లేదేవిటి?

అమ్మ సాయంత్రం పక్కవీధిలో కనిపించినప్పుడు సంగతి చెప్పేశానన్నాడు కదా సాయి. అందుకే కదా ఇప్పటిదాకా అమ్మ కంటపడకుండా తిడుతుందేమోనన్న భయంతో బయట తిరిగి తిరిగి ఆకలికి ఆగలేక ఇల్లు చేరాడిప్పుడు తను. అమ్మ ఆ ఊసే ఎత్తట్లేదే!

రేపు అయ్య వచ్చాక ఏకంగా ఆయనతో కలిసి తిట్టాలని ఆగిందా? లేకపోతే ఇప్పుడు తనంతట తానుగా చెప్పినప్పుడు తిడదామని చూస్తోందా? తనకి బాధగానే ఉంది. ఇలా జరగాలని తను కోరుకున్నాడా? కావాలని చేశాడా తను? కానీ ముందు రెండు సార్లు ఇలాగే అయ్యింది. ఇది మూడోసారి. కోపం రాకుండా ఉంటుందా అమ్మకీ అయ్యకీ! రేపు ఊర్నించి రాగానే సంగతి తెలిసి అయ్య కొడతాడేమో!

అప్పుడప్పుడైనా చిన్నతనం మనసులో మెదలని మనిషే ఉండడేమో. ఔను కష్టాలు కడగళ్ళు పడిన బాల్యమైనా సరే తల్చుకున్నప్పుడు కళ్లనుండి కారేవి ఆనంద బాష్పాలంటుందేమో మనసు.

ఆలోచనల్లో ఏం తింటున్నాడో తనకే తెలియదు. "ఉత్త అన్నం తింటున్నావేమిరా? నేను కలుపుతానుండు పచ్చడి" అంటూ అమ్మ కలుపుతుంటే మౌనంగా చూస్తుండిపోయాడు భీముడు. వీడేమీ చెప్పడే అని గంటలమ్మ మనసులో గుంజాటన. అమ్మ అడగదేమిటి అని కోప్పడదేమిటి అని కొడుకు మనసులో సందేహం.

సాయంత్రం వరకూ తను పడిన బాధ, దిగులూ ఇట్టే మర్చిపోయింది గంటలమ్మ, కొడుకు కడుపునిండా అన్నం తిని లేచాక. గుండెల్లోంచి పెద్ద భారం దిగిపోయినట్టయింది.

రెండు ముద్దలు తను కూడా తిన్నానని పించింది. అమ్మ తింటున్నప్పుడు పొయ్యి దగ్గర సద్దుతున్నప్పుడూ అక్కడక్కడే తచ్చాడుతూ అమ్మ వెనకే కాలుకాలిన పిల్లిలా తిరిగాడు భీముడు. గమనిస్తూనే ఉంది గంటమ్మ. మధ్య మధ్యలో అమ్మా అంటు నన్నాడు గానీ మాటలు మింగేస్తున్నాడు. ఇంతవరకూ అమ్మతో చెప్పకపోవడం దాన్ని గురించి మాట మాత్రంగా కూడా తాను అనకపోవడం, అమ్మ కూడా తెలిసినా తెలియనట్టే ఉండిపోవడం విచిత్రంగా అనిపిస్తోంది. ఎందుకో తెలియదు హఠాత్తుగా అమ్మ మీద జాలి ముంచుకొచ్చింది.

చాప పరుచుకుని చతికిలపడిన అమ్మ పక్కన తనూ చేరాడు.

"అమ్మా!

"ఏవిట్రా భీముడూ?"

"మరి మరి నా మీద నీకు చాలా కోపంగా ఉంది కదూ! కొట్టాలనిపిస్తోంది కదూ!"

చటుక్కున కొడుకు తలమీద చెయ్యివేసి నిమిరింది గంటలమ్మ.

"కొట్టాడమా తిట్టాలని కూడా లేదు నాకు."

మధ్యాహ్నం నించీ గుండెల్లో ఉగ్గబట్టుకున్న ఏడుపు కళ్ళల్లో చెరువైంది భీముడికి. అది చూసి తట్టుకోలేకపోయింది తల్లి ప్రాణం. 'నువ్వెంత కష్టపడి చదివావో నాకు తెలియదా? పరీక్షలక్కూడా తిండీ నిద్రా మానుకుని చదువే లోకంగా గడిపావు. ఆటలకి పోయేవాడివి కాదు. అందరి తెలివితేటలూ ఒకేలా ఉంటాయా? నువ్వు చదువుకోకుండా పరీక్షలకి వెళ్ళలేదు. అలా చేసి ఉంటే నీది తప్పని చెప్పచ్చు. నీకు చేతనైనంతలో చదువుకుని పరీక్షలన్నీ బాగా రాయాలనే రాశావు. కానీ పరీక్ష పోయింది. ఏం చేస్తాం?"

"పదో తరగతి ఒకసారి కాదు రెండు సార్లుకాదు మూడోసారి పోయిందిప్పుడు నేను పనికిరానివాడిని కదమ్మా!"

"ఎవరన్నారు? చదువులో తక్కువైతే వేరే వాటిల్లో తెలివితేటలు చూపించుకోకూడదా? వేరే రకంగా మంచి పనులు చేసుకుని బతక్కూడదా? కిందటి ఏడాది గంగమ్మ కొడుకు పదోతరగతి పోయిందని ఏం చేశాడు? బావిలో దూకి చచ్చిపోయాడు. వాడికి బతికే ధైర్యం లేకపోయింది. నువ్వలాంటి పిచ్చిపని చెయ్యలేదు. అందుకే నువ్వు పనికిరానివాడివి కాదు. పనికొచ్చేవాడివే. నువ్వు పనికొచ్చేవాడివే." కొడుకు భుజం చుట్టూ చేతులు వేసి ధైర్యం చెప్తూ దగ్గరికి తీసుకుంది గంటలమ్మ. పరీక్ష ఓడినా అమ్మ మనసు గెలిచినందుకు ఆనందంగా ఉంది భీముడికి. కొడుకు క్షేమంగా ఇల్లు చేరి[illegible] ఆనందమే..



-తమిరిశ జానకి
9441187182

అమ్మ

అనురాగాల ఒడిలో
ఆప్యాయతలు పంచేది అమ్మ.

ఇంటిని గుడిగా చేసి
ఈనాటి దేవతగా నిలిచేది అమ్మ.

ఉన్నతముగా ఆలోచించి
ఊయలనే బడిగా చేసేది అమ్మ.

ఎదలో ప్రేమను నింపి
ఏనాటికి రుణం తీర్చకోలేనిది అమ్మ.

ఐక్యమత్యాన్ని అంతా చూపి
ఒంటరిని దూరం చేసేది అమ్మ

ఓనమాలు బడిలో నేర్పి
ఔషదముల అమృతం అమ్మ

అందమైన జన్మనిచ్చి
అంతఃపుర సుఖాన్ని పంచేది అమ్మ

-కమ్మరి శ్రీనివాస్ చారి
9177324124

ఏమిటీ దుస్థితి

అభివృద్ధి రథాలు
దూసుకు పోతున్నా
ఇంకా
వెనకబాటు తనమే...
తరాలు మారుతున్నా ...
తలరాత మారని పల్లెల
బతుకు చిత్రాలు ...

రోడ్డు మార్గాలు లేని
పల్లెలు ఎన్నో ...
చినుకు పడితే
జలమయ మయ్యే
కాలి బాటలు ఎన్నో...
నిత్యం
చెరువులు దాటుతూ
ప్రాణాలతో చెలగాటమాడే
అడవి బిడ్డలు ఎందరో....

వాగులు, వంకలకు
ఎదురీదుతూ ప్రాణాలు అరచేతిలో
పెట్టుకుని... సరస్వతి కటాక్షం కోసం
కిలోమీటర్ల దూరం
పయనించే బడి పిల్లలు ఎందరో...

నెలలు నిండిన తల్లులకు
ఎడ్లబండే దిక్కు...
రాళ్లు రప్పల రహదారులపైనే
ప్రయాణాలు...
కడుపు శోకాన్ని మిగిల్చుతున్న ప్రమాదాలు....

సుస్తీ చేస్తే
సూది మందు కోసం
నులక పంచమే అంబులెన్స్...
కిలోమీటర్ల దూరం
మోసుకు పోవాల్సిందే....
ప్రాణాలకు దేవుని మీద
భారం వేయాల్సిందే....

ఏమిటీ దుస్థితి...
ప్రాణాలను పణంగా పెట్టి
మరో జీవికి ప్రాణం పోయడానికి
ప్రసవ వేదన పడే ఆ తల్లికి...
వాగుల పై వంతెన లు లేక
నీటి గండాలు దాటాల్సిందేనా..?.
భర్త వీపు పై పయనించాల్సిందేనా?
ఈ పరిస్థితి మారాలంటే...
పల్లె వాసుల
అవస్థలు తీరాలంటే....
పల్లె పల్లెకు మెరుగు పరచాలి
రవాణా సౌకర్యాలు...

అధికారుల.. పాలకుల మధ్య
సమన్వయం కుదరాలి....
అందరికీ అభివృద్ధి ఫలాలను
అందించినపుడే....
సంపూర్ణ ప్రగతి
భారతాన్ని
సాధించగలుగుతాం....

-కళావతి కందగట్ల
9948263004

అమ్మ

అమ్మ అనే తొలి పిలుపుతో ఆరంభం
నీ బ్రతుకు
అమ్మను స్మరించుటే శుభం
నీ ఊపిరి ఉన్నంత వరకు
గుడిలో ఉంటేనే కాదు దేవత
కళ్ళముందు కదలాడే అమ్మే దేవత
అడ్డాల నాడే కాదు
గడ్డాల నాడైనా అమ్మకు బిడ్డలే!
తన ఆయుష్షు నంతా ధార పోసి
పెంచుతుంది
అమ్మను పంచుకునుట అహంకారం
అమ్మ మనసు గెలుచుకునుట మమకారం
అమ్మను అనాదాశ్రయ పాల్జేయుట
తాము కాబోయే అనాదలమనే సంకేతమే!
అమ్మకు అమ్మైపుట్టినా తీరదు నీ ఋణం!
అమృతం దేవతలందరికీ అందినదో లేదో
అందరికీ పంచుతుంది అమ్మ ప్రేమామృతం
అమ్మ ఆశీర్వాదం కొండంత అండ
అమ్మ ఫోటో గోడకు ఎక్కక ముందే
ఉన్నప్పుడే చూసుకో మరువకుండ
అమ్మ మనసు పాలకుండ
మసలుకో మనసు విరగకుండ
కాపాడుకో చేయి జారకుండ
జారితే ఉంటుందా పగలకుండ
దొరుకుతుందా కోట్ల జన్మ లెత్త కుండ
అమ్మకు సేవచేయని జన్మ చెత్త కుండ
శ్రవణ కుమారుని వలె నిత్య సేవ చేయు
ఉంటుందా నీ జన్మ తరించకుండ

- పి.బక్కారెడ్డి
9705315250

ప్రముఖ రచయిత్రి శైలజామిత్ర రాసిన 16 బాలల కథలు ఇవి. రచయిత్రి పిల్లల కోసం రాసినప్పటికీ పిల్లలే కాదు పెద్దలందరూ చదవాల్సిన కథలివి.

ఈ వారం నుండి నేటినిజం పాఠకుల కోసం..
- సంపాదకులు

చిట్టి చిలకమ్మ

(కథ)

"ఊరుకో చిలకమ్మా! ఇపుడేం చేయగలం? జరగవలసినదంతా జరిగిపోయింది. పక్షి జాతిలో మనం మరీ సున్నితమైన మనస్కులం. ఎవరేమన్నా తలొంచుకుని పోతుంటాం. జాతి ఏదయినా ఆడ మగ అనే అహంకారం తప్పదు మరి. మరీ గద్ద జాతాయే! తప్పుతుందా? ఆపాపిష్టి గద్ద పాలన బడి పచ్చని చిలకమ్మ ఉసురు పోయింది. ఇపుడేమనుకుని ఏం లాభం? అరచి గెలవలేము. అలాగని మనకోసం పోరాడటానికి ఎవరు ముందుకొస్తారు? చెప్పు? భగవంతుడు దాని రాత అంతే రాసాడనుకో. లేచి ఒక పండైనా నువ్వు తిను. నువ్వూ దానితో పోలేవుగా" అన్నాయి సాటి చిలకలు. ఓదార్చుతూ..

"ఎలా ఊరుకోనమ్మా? ప్రేమన్నాడు. పెళ్ళి చేసుకుంటానన్నాడు. మీరేమో గద్దలు. మేమేమో చిలకలు. మనకు ఎలా సామీప్యం కుదురుతుందని అందట కానీ."

"అలా అన్నా కూడా నీ వెనుక పడ్డాడా?" అంది ఆవేదనగా మరో చిలక ...

"అవునమ్మా! ప్రేమకు జాతుల్లేవు. పక్షుల తేడాల్లేవు. నేను నిన్ను పెళ్ళి చేసుకుని మహారాణిలా చూసుకుంటాను అన్నాడట. మాయమాటలు చెప్పి నన్ను వంచన చేసాడు. తీరా గర్భవతినైన నా బిడ్డను చూస్తూ మొరపెట్టుకుంటే జాతుల గురించి మాట్లాడాడు. మేము గద్దలం. మా జాతి అంటే అందరికీ భయం. నేను నిన్ను పెళ్ళి చేసుకోవడమేమిటి? ఏదో కాస్త రంగురంగులు గా ఉన్నావని ముచ్చటపడ్డాను. అంతే.. అంతమాత్రానికే నీ గోలేమిటి? కావాలంటే నీకు ఒక గూడు ఇస్తాను. అందులో పడిఉండు. అపుడపుడు ముచ్చట తీర్చుకుంటాను" అన్నాడట" అంటూ మరింతగా ఏడ్చింది.

" అయినా ఆ పిచ్చిది ఎలా నమ్మింది? గద్ద జాతికి మన జాతికి ఎక్కడ కుదురుతుంది? కాస్తంత మంచి మాటలు చెబితే నమ్మేయడమేనా? ఆ తర్వాతైనా మా అందరికీ తెలియజేయాల్సింది. అంది మరో వృద్ధ చిలక ఆవేశంగా..

"అరచి గీ పెట్టినా పోయేది మన పరువే. అలా చేస్తే చిలకలు ఇలా ఎవరు ప్రేమిస్తే వారితో జీవిస్తాయేమో అనుకొని ప్రతి పక్షి కన్ను వేస్తాయని ఆ నయవంచకుని మోసం గుండెల్లోనే దాచుకోలేక, తలెత్తుకు బతకలేక ఆఖరికి ప్రాణాలే తీసుకుంది" అంది కన్నీరు మున్నీరవుతూ తల్లి చిలక..

"చిలకమ్మా! చిలకమ్మా! గూట్లో ఉన్నావా?" అంది కాకి లోనికి వస్తూ .

" ఉండకేం చేస్తాం కాకమ్మా? పుట్టెడు దు:ఖంతో ఇల్లు కదలలేక పోతుంటిమి" అంది తల్లి చిలక కన్నీరొత్తుకుంటూ.

"విషయం తెలిసింది. ఊరికే కన్నీరు పెట్టి హైరాన పడమాక.. గుట్టును రట్టు చేసుకుంటే పోయేది నీ పరువే." హెచ్చరించాయి కాకులు.

" ఎంతసేపూ పరువు పరువు అంటారే తప్ప ఆ దుర్మార్గుడి దౌష్ట్యానికి చరమగీతం పాడేవారే లేరా? మొన్నటికి మొన్న నవ్వుతూ పిచ్చుక తన దారిన పోతుంటే దారికాసి గబ్బిలాలు వెంటపడి చంపేదాకా తెచ్చాయట. తీరా గూడు చేరేసరికి ఒక రెక్క దెబ్బతిని ఇప్పటికీ కోలుకోలేక పడిఉంది.

పాపం. ఆ తల్లి బాధను చూడలేకపోయాము. ఇపుడూ ఎవరూ ఏమీ అనలేకపోయారు. ఇపుడు నా బిడ్డ ఏకంగా చచ్చిపోయింది. విషయం తెలిసిన ఏ ఒక్కరూ ఇందుకు కారణమేమిటని ఆరా తీసి వాటి ఆట కట్టేవారు లేరు. కలిసికట్టుతనం లేకనే ఒక జాతి బలహీనమని, మరొకజాతి బలమైనదని నమ్ముతున్నాం. కలిసి కట్టుదనం లేని ఈ ఆడజాతి ఎపుడూ ఇలా కుమిలిపోవాల్సిందే కుమిలిపోవాల్సిందే అంటూ కుప్పకూలిపోయింది దు:ఖంతో..

" నిజమేకానీ.. ఆ పిచ్చుకలు అంత రాత్రి వరకు గూడు చేరకుండా ఏమి చేస్తున్నట్లో" అన్నాయి కాకులు"

" లోకులు కాకులు అన్న నానుడి పోనిచ్చుకున్నావు కాదు. నీకు తెలియదా? పావురాలు బడిని నడుపుతున్నాయని, పక్షులు ఎగరడం, ప్రమాదం వస్తే పారిపోవడం, శత్రువుని కనిపెట్టడం, వాతావరణాన్ని అనుసరించి వలస ఎక్కడికి వెళ్ళాలి అనే అంశాలను తెలియజేస్తున్నాయి. అందులో చిన్న పక్షులన్నీ హాజరవుతున్నాయి. గద్దలేమో పాఠశాలకు కావలి కాస్తున్నాయి. పావురాలు, వలస పక్షులు అన్నీ ఉపాధ్యాయులు. రాబందులేమో వచ్చే ఆదాయాన్ని చూసుకుంటున్నాయి. అలా చేరే నా చిట్టి చిలకమ్మ ఆ గద్ద వలలో పడింది" అంది చిలక ఆవేదనగా

"అలాగా మరి నాకేమీ పోస్టు ఇవ్వలేదే? నేను బడి తెరవడానికి మూయడానికి కావు కావు మంటూ హెచ్చరించేవారంగా? మరీ మా జాతంటే అందరికీ లోకువ. మేము కనక ఉండి ఉంటే అక్కడ ఇలాంటి అరాచకాలు జరిగేవి కావు. ఏ విషయాన్నయినా కావు కావు మని అందరికీ చెప్పేస్తాము ఛీ ఛీ. వీటన్నిటికీ బాధ్యత వహించే నెమళ్ళు కనీసం ఒక్క విషయమైనా చెప్పవు . నెమ్మదిగా ఉంటూనే చేయాల్సిన పనులన్నీ చేసేస్తాయి. మంచి పేరును సంపాదించేస్తాయి. అన్నాయి కాకులు విసుగ్గా..

"బావుంది వరస. వర్షం వస్తోందని, ఉప్పులోడు ఏడ్చాడట, పప్పులోడు ఏడ్చాడట. టెంకాయల వాడు దొర్లి దొర్లి ఏడ్చాడట. అలా ఉంది నీ వరస. బిడ్డను కోల్పోయిన నేను ఏడుస్తున్నాను. బిడ్

విజనాయంద కృష్ణ 'ఆనంద కుటీరం' ఆవిష్కరణ

'ఆనంద కుటీరం' తొలి ప్రతిని వనంజ్వాలా నరసింహారావుకు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్

తన స్వీయ చరిత్ర ద్వారా తెలంగాణసమకాలీన సామాజిక, రాజకీయ చరిత్రను అక్షరీకరించిన వైతాళికుడు మాదిరాజు రామకోటేశ్వరరావు. అలాంటి మహనీయుల జీవితం ఆధారంగా ఆయన మనుమడు మాదిరాజు విజయానంద కృష్ణ 'ఆనంద కుటీరం' నవల రాయడం అభినందనీయం' అని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ అన్నారు. తన జీవిత చరిత్రలో తన గురించికంటే తాను చూసిన ఆనాటి సామాజిక ఘటనల గురించి వినయంగా వివరించిన వ్యక్తిని నవలలో కథా నాయకుడిగా ముందు పెట్టడం బావుందని ప్రశంసించారు. తద్వారా రామకోటేశ్వరరావు ప్రజా జీవితం ఈతరానికి పరిచయం అవుతుందని పేర్కొన్నారు. అభినందన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రవీంద్రభారతి వేదికగా మాదిరాజు విజయానంద కృష్ణ రచించిన 'ఆనంద కుటీరం' నవలను కె. శ్రీనివాస్ ఆవిష్కరించారు. తొలిప్రతిని తెలంగాణ సీఎం ప్రధాన పౌర సంబంధాల అధికారి వనం జ్వాలా నరసింహారావుకు అందజేశారు. అనంతరం కె. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ వికాసోద్యమంలో మాదిరాజు రామకోటేశ్వరరావు నిర్వహించిన పాత్రను వివరించారు. వరంగల్ కేంద్రంగా సాగిన తెలంగాణ సామాజిక సాంస్కృతికోద్యమాన్ని చరిత్రలో లిఖించిన ఘనత రామకోటేశ్వరరావు సొంతమని తెలిపారు. అలాంటి మహనీయుడి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిందిగా ఆయన కుటుంబ సభ్యులను కోరారు.

'ఆనంద కుటీరం' తొలి ప్రతిని స్వీకరించడం తనకు దక్కిన ప్రత్యేకమైనగౌరవంగా భావిస్తున్నట్లు వనంజ్వాలా నరసింహారావు వ్యక్తం చేశారు. భద్రాచలం భౌగోళికంగా తెలంగాణకు చెందుతుందని ఒక సందర్భంలో తాను 'ఆంధ్రజ్యోతి'కి రాసిన వ్యాసానికి మూలాధారంమాదిరాజు రామకోటేశ్వరరావు స్వీయ చరిత్ర అని నరసింహారావు తెలిపారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, మాదిరాజు రామకోటేశ్వరరావు మనుమరాలు అభినందన భవాని, మనుమడు మాదిరాజు విజయానంద్ కృష్ణ, ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞశర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగుడు ధనుంజయ్ బుద్ధ ఆలపించిన సినీగీతాలు సభికులను ఆకట్టుకున్నాయి.

జ్ఞాన శూన్యులు

కనిపించని దారాలతో అల్లికలు అల్లుకున్నట్టే
కనిపించని బంధాలు మన చుట్టూ అల్లుకుంటాయి
ఏ బంధాలు ఏ పూర్వజన్మ సంబంధాలో
మనకేం తెలుసు
నీటిమీద అడుగులు పడనట్టు
మన గత జన్మల సంబంధాలు
మనకి తెలీకుండానే మనల్ని వెంటాడుతుంటాయి
ఎంత దూరంలోనివైనా చెంతకొచ్చి
అనుబంధాలై మనల్ని
చిన్న పిల్లలు మన మెడపట్టుకొని
గుండెల మీద ఊయలలూగినట్టు
పెనవేసుకుంటాయి మనల్ని
దుఃఖాశ్రువులు కురిపించేవి కొన్ని
ఆనంద బాష్పాలు రాల్చేవి మరికొన్ని
ఎంత కురిసినా ఆగిపోయాక
తడి కనిపించని ఆకాశంలా
కాలంతో పాటు కొన్ని అనుబంధాలు
చెరిగిపోయిన రాతలవుతాయి
కడలిలోని అలల్లా మళ్ళీ మళ్ళీ వచ్చి పోతుంటాయి
గుండెను బరువెక్కించేవి కొన్ని
గుండె మేఘాన్ని తాకి కురవబోయే
కన్నీటి వానను చెదరగొట్టే
తీవ్రమైన గాలులు మరికొన్ని
ప్రాణమున్న మనుషులకే కాదు
ప్రాణంలేని వస్తువులతోనూ
ముడివేసుకుంటాయి అనుబంధాలు
ఎవరితో ఏ బంధం ఎందుకో ఎంతవరకో
మనం జ్ఞాన శూన్యులం.

-మాధవీసనారా,
8639491246

కలియుగ నిగమ శర్మ

(కథ)

"ఏమోయి సుబ్బావధానీ! ఈ అప్రదిష్ఠ ముచ్చట విన్నావా" అంటూ ఆ రోజు శ్రాద్ధ భోజనంలో తిన్న బుట్టెడు నేతి గారెలు అరగక ఆపసోపాలు పడుతూ పెద్ద మర చెంబు నీళ్ళు గడగడా త్రాగేసి నిగనిగ లాడే పొట్ట మీదకి నోటి నుంచి క్రిందకు జారుతున్న ముత్యాలవలె మెరుస్తున్న నీటి బిందువులను భుజంపై ఉన్న ఉత్తరీయంతో తుడుచుకుంటూ అన్నాడు సోమయాజులు.

"నీవు చెప్పకుండా నాకు ఎట్లా తెలుస్తుంది" అన్నాడు కేసులు లేక గోళ్ళు గిల్లుకుంటూ మేజిస్ట్రేట్ కోర్టు ముందు ఉన్న చేప చెట్టు క్రింద కూర్చున్న ప్లీడరు లాగా లా పాయింటు తీస్తూ సుబ్బావధాని.

"అదేనండీ! మన నారాయణమూరి గారి పుత్ర రత్నం లక్ష్మీపతిశర్మ ప్రతి ఆదివారం ఆ షకీల్ మాంసం దుకాణంకు పోయి ఒక కేజి మాంసాన్ని ఏరికోరి మరీ కొనుక్కొని పోతున్నాడట" అన్నాడు సోమయాజులు తన పొట్టలో భారం సగం తగ్గించుకుంటూ..

"ఈ విషయం తమకు ఎలా ఎరిక అయ్యింది" అన్నాడు రహస్యంగా సుబ్బావధాని. "నాకు మొన్న బజారులో షకీల్ కనపడి విషయం చెప్పి మన వర్గం వారిని హేళనగా కించపరుస్తూ మాట్లాడాడు" అని ఉక్రోషంగా అన్నాడు సోమయాజులు.

"ఇలాంటి అనాచారపు పనులు చేస్తున్న లక్ష్మీపతి శర్మలాంటి వారి వల్లనే మన పరువు ఏట్లో కలిసిపోతొంది. ఈ విషయమై నారాయణ మూర్తిగారిని వెంటనే నిలదీసి ప్రశ్నించాలి" అన్నాడు సుబ్బావధాని.

"ఆలస్యం అమృతం విషం అన్నారు. ఇలాంటి మంచి పనులకు వారాలు వర్జాలు మీనమేషాలు లెక్క పెట్టకూడదు. పద నిజానిజాలు ఇప్పుడే తేల్చి, ఒకవేళ అతగాడు అప్రాచ్యపు పనులు చేస్తుంటే వారి కుటుంబాన్ని వెలివేయాలి. దీనివల్ల రాబోయే రోజుల్లో ఈ అగ్రహారంలోని బ్రాహ్మ ణ్యంలో ఇతరులెవ్వరూ ఇలాంటి దగుల్బాజీ పనులు చేయరు.." అని వీధి అరుగు మీద నుంచి దిగి ధోవతిపైకి ఎగకట్టి వడివడిగా నడవసాగాడు సోమయాజులు.

కుడిచేయి చూపుడు వేలు బ్రొటనవేలు చివరిగణు పులలో ఇరికించి పట్టుకున్న నశ్యం పొడిని శ్వాసగట్టిగా పీల్చి రెండు ముక్కు రంధ్రాలలోకి బాగా దట్టించి నిషా ఎక్కిన కళ్ళతో తలకెక్కిన హుషారయిన 'కిక్కు'తో ఉత్సాహం రెట్టింపయి ఊడిపోతున్న బిళ్ళగోచినీ బాగా ద ంచి లాగి దోపుకొని సోమయాజుల వెంట ఆపసోపాలు పడుతూ నడవసాగాడు సుబ్బావధాని.

"ఎవరో పరాయివారి మాటలు విని బుద్ధిమంతుడు లాంటి మన కొడుకును అనుమానించడం అన్యాయం అండీ" అని నారాయణమూర్తిగారి భార్య రోహిణమ్మ భయం భయంగా భర్తతో అన్నది.

"అసలు నీ గారాబం వల్లనే వీడు ఇలా తయారయ్యాడు. హోయిగా మన కులవృత్తి అయిన య జ్ఞికం నేర్చుకోరా సంఘంలో గౌరవమూ బ్రతుకు తెరువు కలుగుతుంది అని నెత్తి నోరు కొట్టుకొని చెబితే తల్లీ కొడుకులు నా మాట వినలేదు. కొడుకేదో ప్రఖ్యాత వైలెన్ విద్వాంసులు అయిన ద్వారం వెంకటస్వామి నాయుడు గారి లాగా పేరు ప్రఖ్యా తులు తెస్తాడు అని కలలు కన్నావు ఇప్పుడు చూడు చివరికి వీడు మన వంశానికి అపఖ్యాతి తెస్తూ మన పరువు బజా రున పడవేస్తు న్నాడు. ఇక వాడు ఒక్క క్షణం కూడా నా ఇంట్లో ఉండటానికి వీలు లేదు. వాడు ఇంటికి రాగానే మెడపట్టి బయటకు గెంటుతాను" అని పంతంగాను, కోపం గానూ అన్నాడు నారాయణమూర్తిగారు.

"వీరు చెప్పింది నిజమో కాదో తెలుసుకోకుండా ఇలాం టి దుర్మార్గమైన నిర్ణయాలు తీసుకోవడం బాగాలేదండీ" అని అన్నది రోహిణమ్మ.

"అయ్యా! నేను నిజమే చెబుతున్నాను మీరు ఎవ్వరూ ఈ విషయమై మీ వాడిని ప్రశ్నించకండి రేపు మనం ముగ్గురం రహస్యంగా మీ సుపుత్రుడ్ని అనుసరించి పట్టుకుందాం. అప్పుడే అసలు ఇజం తెలిసిపోతుంది" అని అన్నాడు సోమ యాజులు.

"సరే! మీరు సలహా ఇచ్చినట్లే మనం చేద్దాము అని నారాయణమూర్తిగారు బాధపడుతూ అన్నాడు.

×××

మర్నాడు లక్ష్మీపతి శర్మ యధా విధిగా స్నాన సంధ్యలు ముగించుకొని తల్లిపెట్టిన చద్ది అన్నం తిని సంగీతం నేర్చుకొనటానికి వీర భద్రయ్య మాస్టారు దగ్గరికి పోతున్నాను అని తల్లికి చెప్పి వైలెన్ పెట్టె తీసుకొని బయలుదేరాడు.

అతని వెనుకనే నారాయణమూర్తి, సోమయాజులు, సుబ్బావధాని రహస్యంగా అనుసరించసాగారు.

లక్ష్మీపతిశర్మ షకీల్ షాపు వద్దకు వచ్చి నిలబడ్డాడు. ఆరోజు ఆదివారం కనుక అక్కడ చాలా మంది వచ్చి మాంసం కొంటున్నారు. లక్ష్మీపతిని చూడగానే షకీల్ షాపులో నుంచి బయటకు ఆతృతగా వచ్చి లక్ష్మీపతి శర్మ చేతికి మాంసంతో నింపిన ప్లాస్టిక్ సంచీ ఇచ్చాడు.

షకీల్ చేతికి లక్ష్మీపతి శర్మ డబ్బులు ఇచ్చాడు.

అయ్యా! పంతులుగారు! లేత లేత రాగి ఆకులు తిన్న మేకలు నా దగ్గర లేవు. మీరు ప్రత్యేకంగా అడిగారు కనుక పొరుగూరులో ఉన్న ఎర్రుపాలెంలో గొల్ల గంగులు దగ్గర నుంచి ఎక్కువ ఖరీదు పెట్టి కొని మేకను కొని ఈ మాంసం మీకు ఇస్తున్నాను అని అన్నాడు షకీల్.

"సరే రేపు నీకు మిగతా మొత్తము ఇస్తాను" అని చెప్పి ఒక చేతిలో మాంసపు సంచీ రెండో చేతిలో వైలెన్ పట్టుకొని గబగబా నడవసాగాడు లక్ష్మీపతి శర్మ.

ముగ్గురు ఆశ్చర్యంగా లక్ష్మీపతి శర్మను అనుసరించసా గారు. ఆ ప్రాంతమంతా అస్తవ్యస్థంగా ఉన్నది. దారి అంతా ఎత్తు పల్లాలు చిన్న చిన్న సందులు మలుపులు. రోడ్డుపై డ్రైనేజి నీరు కాలవలా ప్రవహిస్తూ దుర్గంధమైన వాసనలు వస్తున్నాయి. పందులు, కుక్కలు అక్కడి మురికి నీటిలో జలకాలాడుతున్నాయి. ఈగలు, దోమలు వాటి శరీరాలపై నాట్యం చేస్తున్నాయి

ఒంటిపై గోచి కూడలేకుండా నగ్నంగా ఆ బస్తీ చిన్న పిల్లలు ఆ బురదలోనే ఆడుకుంటున్నారు. అక్కడే మగవారు స్నానాలు చేస్తున్నారు. ఆడవారు బట్టలు ఉతుకుతున్నారు. మరి కొందరి ఇళ్ళముందు చేపలు మంచాలమీద పోసి ఎండబెట్టారు. దుర్గంధమైన ఆ చేపల వాసనకు ఆ ముగ్గురికీ కడుపులో చెయ్యి పెట్టి తిప్పినట్లు అయి వాంతి చేసుకోబోయి బలవంతంగా తమ నోళ్ళకు ఉత్తరీయం అడ్డం పెట్టుకొని లక్ష్మీపతి శర్మకు దూరంగా నడవసాగారు.

ఇలాంటి వేషధారణతో తమ బస్తీకి ఎవ్వరూ రారు, అని ఆలోచిస్తూ ఈ ముగ్గురు బ్రాహ్మణులవైపు ఆ వీధిలోని మనుషులు వింతగా చూడసాగారు.

లక్ష్మీపతి శర్మ ఒక చిన్న రేకుల షెడ్డు లాంటి ఇంటి ముందు నిలబడి తలుపుతట్టాడు. కొద్ది సేపటికి ఆ ఇంటి తలుపు తెరుచుకున్నది. రమాపతి శర్మ తల తిప్పి రోడ్డువైపు చూసి తనను ఎవ్వరూ తమనించడం లేదు అనే నిర్ధారణకు వచ్చి తటాలున లోపలికి ప్రవేశించి తలుపుమూశాడు.

"అయ్యా! నారాయణమూర్తిగారూ మీ పుత్రరత్నం పెద్ద గ్రంధసాంగుడే. మనకు ఎవ్వరికీ తెలియకుండా ఇక్కడ ఒక చిన్న ఇంటినే నడుపుతున్నాడు" అని అన్నాడు సోమయాజులు.

మీరు ఊహించి నిందవేసినట్లుగా దుష్టడైన ఆనాటి నిగమశర్మ కాదు నా శిష్యుడు, ఉత్తమ గుణ సంపన్నుడైన కలియుగ నిగమ శర్మ ఈ లక్ష్మీపతిశర్మ అయినా "క్షమించటానికి, దీవించటానికి అన్నీ ఆ సర్వేశ్వరుడికే చెల్లుతుంది మనం నిమిత్తమాత్రులం"

"నువ్వు బిగ్గరగా మాట్లాడకు అతగాడు లోపల ఏ ఘన కార్యం వెలగబెడుతున్నాడో రేకుల తలుపు సందులో నుంచి గమనించుదాము పదండి మూర్తిగారూ" అని ముందుకు దారితీశాడు సుబ్బావధాని.

ఒక ముసలి మహమ్మదీయ వ్యక్తి విరిగిపోయిన కుర్చీలో కూర్చొని వైలెన్ వాయిస్తూ ఎదురుగా నేలపై కూర్చొన్న లక్ష్మీపతి శర్మకు సంగీతం నేర్పుతున్నాడు. దాదాపు గంటసేపు ఇద్దరూ అద్భుతమైన వైలెన్ సంగీతాన్ని సాధన చేశారు.

గది బయట నిలబడ్డ ముగ్గురికి ఏమి జరుగుతుందో అర్థం కావడం లేదు తాము ఊహించని సందర్భానికి భిన్నంగా లోపల జరుగుతున్న తతంగాన్ని చూస్తూ ఆశ్చర్యప డసాగారు. సంగీత సాధన అయిపోగానే ఆ ముసలి వ్యక్తికి నమస్కరించి బయలుదేం బోయాడు లక్ష్మీపతిశర్మ.

"'శర్మం! బేటా ఏక్ మినిట్ రుకో" అన్నాడు ఆ ముసలి వ్యక్తి.

'ఖాన్ సాబ్! మీకు ఇంకా ఏమైన అవసరం అయితే అడగండి తెచ్చిఇస్తాను" అని వినయంగా చేతులు కట్టుకొని అడిగాడు లక్ష్మీపతి శర్మ.

"నన్ను క్షమించు శర్మా బేటా! నీ యొక్క లక్ష్య సిద్ధిని పరీక్షించడానికి ఈ విధంగా ప్రవర్తించాను. మీ సంగీత గురువుగారు వీరభద్రయ్య నేను ఒకే గురువు గారయిన నాయుడుగారి దగ్గర వైలెన్ నేర్చుకొన్నాము. నా శ్రద్ధతో తెలివితేటలతో మా బృందంలో నేనే అందరికన్నా బాగా సంగీతం నేర్చుకొన్నాను. కానీ నా స్వయంకృతాపరాధం వల్ల చెడు అలవాట్లకు బానిసనై నా జీవితాన్ని నాశనం చేసుకొన్నాను. అనాలోచితంగా పెరిగిన కుటుంబ భారం వలన ఖర్చులు ఎక్కువై ఇలాంటి బీద స్థితిలో బ్రతకవలసి వచ్చింది.

గురువుకు తగిన శిష్యుడు దొరికినప్పుడే ఆ గురువుగారి యొక్క అతని జీవితానికి సార్థకత ఏర్పడుతుంది. నావద్ద ఉన్న విద్య ఎవరికి నేర్పాలా అని ఆలోచిస్తున్నప్పుడు వీరభద్ర య్య నిన్ను నా వద్దకు పంపాడు" అని అన్నాడు ఖాన్‌సాబ్.

"నేను మీ వద్దకు సంగీతం నేర్చుకోవ టానికి రావడం వల్ల మీకు ఏమైన ఇబ్బంది కలిగితే క్షమించండి" అని అన్నాడు లక్ష్మీపతి శర్మ.

"మేము నేర్చుకొన్న విద్యను తగిన శిష్యులకు నేర్పితేనే మాకు సద్గతి కలుగుతుంది అని మా గురువుగారు మాకు బోధించారు. తైత్తరీ యోపనిషత్తులో చెప్పిన విధంగా 'సహనావవతు సహనౌభువక్తు సహవీర్యం కరవావహై' అన్నట్లు తాదాత్మం, సహకారం, నిరంతర అభ్యాసంతో ప్రగతి మార్గంలో వయనిస్తూ ఈనాటి ప్రపంచానికి ఆదర్శ గురు శిష్యులమై తరిద్దాము. ఆ నియమాన్ని నేను నెరవేర్చటానికి అల్లాయే నిన్ను నా వద్దకు పంపించి నన్ను కృతార్థుడిని చేశాడు.

"నీకు నిజంగా సంగీతంపై శ్రద్ధ ఉందో లేక బృహస్పతి కొడుకైన కచుడు దేవతల మంచి కొరకు మృత సంజీవినీ విద్య సంపాదించడానికి శుక్రాచార్యుల వారి వద్ద వచ్చిన రీతిలో నీవు వచ్చావేమోనని చిన్న పరీక్షపెట్టాను" అని అన్నాడు ఖాన్ సాబ్.

"గురువుగారు! మీరు ఏమి చెబుతున్నారో నాకు అర్థం కావడం లేదు" అని అన్నాడు లక్ష్మీపతి శర్మ.

'నన్ను మన్నించు బేటా! నీవు స్వచ్ఛమైన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టావు. నిప్పును కడిగే ఆచారాలు మీవి. జీవహింస మీకు అసలు గిట్టదు. మాంసము వైపు కన్నెత్తి కూడా చూడరు. కానీ నీ యొక్క పట్టుదల పరీక్షించటానికి నా జిహ్వాపచాపల్యాన్ని, తీర్చుకొవటానికి లేత లేతరాగి ఆకులు తినే వేక మాంసాన్ని కోరి కోరి మరీ నీ చేత తెప్పించుకున్నాను. ఈ సంగతి మీ వారికి తెలిస్తే నీ జీవితం ఎంతో ప్రమాదంలో పడుతుంది కానీ నీ అసమాన దీక్ష సంగీతం పట్ల శ్రద్ధ నన్ను ఎంతో ముగ్ధుడిని చేశాయి. ఇక నుంచీ నీవు నాకు మాంసం తెచ్చి ఇవ్వనవసరం లేదు" అని అన్నాడు ఖాన్ సాబ్.

"అయ్యా! గురువుగారూ! మరి అలా అయితే నా సంగీత సాధన సంగతి ఏమిటి" అని గాభరాగా అడిగాడు లక్ష్మీపతి శర్మ.

'శర్మ బేటా! నాకు తెలిసిన అన్ని సంగీత విద్యలు నీకు నేర్పి మన భారతదేశంలో గొప్ప వైలెన్ వాయిద్య కళాకారుడిగా చేస్తాను. ఇదే నా ప్రమాణం' అంటూ లక్ష్మీపతి శర్మను కౌగిలించుకొని ఆశీర్వదించాడు.

సోమయాజులుకు, సుబ్బావధానికి నోట మాటరాలేదు. నారాయణ మూర్తికి ఎంతో ఆనందం వేసి ఆత్రుతగా రేకుల తలుపు త్రోసుకొని గదిలోకి ప్రవేశించాడు.

"నాన్నగారు! మీరు ఇక్కడికి ఎలా వచ్చారు" అని ఆశ్చర్యపోతు అన్నాడు లక్ష్మీపతి శర్మ.

"బాబూ! మేము దుర్బుద్ధితో నీ మీద అపనింద వేసి దాన్ని రూపించటానికి మీ నాన్నగారిని బలవంతంగా తీసుకొని వచ్చాము. మాకు బుద్ధి వచ్చింది. నీలాంటి ఉత్తముడైన కొడుకును కన్నందుకు మీ తల్లిదండ్రులు అదృష్టవంతులు" అని అన్నారు సోమయాజులు, సుబ్బావధాని.

"ఖాన్‌గారూ! మీ లాంటి విద్వత్తు గల సంగీత గురువు మా అబ్బాయికి దొరకడం మా అదృష్టంగా భావిస్తాను అని నారాయణమూర్తి ఖాన్‌గారికి నమస్కరించాడు.

"అయ్యా! మీ వాడు కడిగిన ముత్యంలాంటి నిష్కాగరిషుడు. విద్యపై ఎంతో శ్రద్ధాశక్తులు ఉన్న మీవాడు గొప్ప ప్రయోజకుడిగా రాణించి మీకు గొప్ప పేరు ప్రతిష్ఠలు సంపాదించి పెడతాడు" అని అన్నాడు ఖాన్.

"అయ్యా! ఖాన్ సాబ్‌గారూ! మమ్మల్ని క్షమించండి" అంటూ సోమయాజులు, సుబ్బావధాని అన్నారు.

మీరు ఊహించి నిందవేసినట్లుగా దుష్టడైన ఆనాటి నిగమశర్మ కాదు నా శిష్యుడు, ఉత్తమ గుణ సంపన్నుడైన కలియుగ నిగమ శర్మ ఈ లక్ష్మీపతిశర్మ అయినా "క్షమించటానికి, దీవించటానికి అన్నీ ఆ సర్వేశ్వరుడికే చెల్లుతుంది మనం నిమిత్తమాత్రులం'' అని అన్నాడు ఖాన్‌సాబ్.

- జన్నాభట్ల నరసింహప్రసాద్
సెల్: 8297263741

విలక్షణమైన అభివ్యక్తితో "మౌనమూర్తి"

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

"తమ తప్పులకీ.. అసంతృప్తులకూ.. సమస్యలకు దేవునిపై నెపం మోపకుండా. పుట్టుక నుండి చావు వరకు జీవితమే తాత్కా లిక ప్రయాణం జరపడానికి వచ్చిన అతిథు లుగా మనం కాస్తంత వివేకంతో.. విచక్షణ తో..విజ్ఞతతొ ఏ వివాదాలకు తావి వ్వ కుండా.. తోటివారి హితమ్ పరమా వధిగా జీవించాలన్న చింతనను కలగజేయ డానికి.. గుర్తు చేయడానికి కవి రాజేశ్వ రరావు చేసిన ప్రయత్నం ప్రశంసనీయం"

కవితాను అనుభవించే అనేక మాన సిక స్థితి గతులను బట్టి ఏర్పడే భావాలు 'వస్తువు' గా దానికి మెరుగులు దిద్దడం లో అతనను ఎంచుకునే విధానం 'శిల్పం'గా మూర్తీబ¸వించి 'కవిత్వం'గా రూపుదిద్దు కుంటుంది.

తన అనుభవాలు, అను భూతుల ననుసరించి తదనుగు ణంగా కవి మనస్సును ప్రేరేపించే స్పందనగా, ప్రతిస్పందనగా వెలువడే కవితా ఆకృతిని ఏర్పర్చుకుం టుంది. కవిత్వంలో ప్రస్ఫుట తకు ఆధారంగా నిలిచేది అంతరంగం అని చెప్పవచ్చు.

ఎన్నో అనంతమైన ఆలోచనల్నీ, స్థితుల్నీ, నిక్షిప్తం చేసుకున్న సాగరంలాంటిది అంతరంగం! లోలోన ఉండే భావాలను, అనుభూతులను, అనుభవించే కవి మనస్సు చీకటిగా ఉంటేదాన్ని వెలికితీసి, వెలుగులోకి తెస్తూ జగమంతటికీ ఉదయమయ్యే విధంగా తేట తెల్లం చేసి, అక్షర ప్రభాతం జరగా లని కవి చేసే ప్రయత్నమే 'కవిత్వ' రచనగా పేర్కొనవచ్చు. కవి ప్రారంభంలో స్వీయాను భవాల నేపథ్యం తప్పని సరిగా దృశ్యీకరిం చేది ప్రణయ సంకీర్తనం! ఈ ఆరాధన భావుకుడ్ని మరింత భావు కతకు దగ్గర చేస్తుంది. కవిత్వంపై స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ చేకూర్చుతుంది. భావ కవిత్వం లోతైన అంతర్లీనంగా ఆరాధన కన్పించే కవితాశైలి సహజం గా భావుకుల హృదయాల న్నింటి లోనూ ఉంటుంది. ఇది అర్థాన్ని వ్యక్తీకరించే ఏ పదంలోనైనా సులభంగా ఒదిగిపోయి సున్నితంగానూ, ఆవేశంతోనూ మృదువుగా మదిని తాకుతుంది. అందుకే, కవి ఐహి కంగా వివిధ రకాల మానసిక స్థితిల్లో ఉ న్నప్పటికీ భావ కవిత్వం దగ్గర మాత్రం, వివశుడై, ఆరాధకుడై వినమ్ర మనస్వితుడౌతాడు. ఈ క్రమం లోనే కవి లేదాళ్ళ రాజేశ్వ రరావుగారు.. దైవాన్ని కేంద్రంగా చేసుకుని.. మను ష్యులుగా మనం అసంబద్ధ మైన కోరికలను విడనాడి.. ఉన్నతంలో బతుకు దామన్న గొప్ప సందేశంతో 'మౌన మూర్తి' కవితా సంపుటిని ప్రకటించి తమ ఉత్తమ వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. ప్రకృతినే దైవంగా భావించి.. ఆరాధించి మన ము నులు, ఆధ్యాత్మికవేత్తలు, తత్వచింత నాప రులు చూపిన మార్గాన్ని అనుసరించి సహజ ంగా బతకడం అలవర్చుకోవాలని హితవు పలుకుతూ,, కవి రాజేశ్వరరావు గారు ఈ గ్రంథానికి జీవం పోశారు.

దైవాన్ని కోర్కెలు తీర్చు మని ప్రార్థించడం కన్నా.. హా యిగా ఆనందంగా.. నింపాలి గా.. ప్రశాంతంగా రోజులు గడిపే చిత్తాన్ని ప్రసాదిం చుమని వేడుకోవాలన్న అర్థం ధ్వనించే విధంగా ఇందలి రచనను కొనసా గించడం బాగుంది.

తమ తప్పులకీ.. అసంతృప్తులకూ.. సమస్యలకు దేవునిపై నెపం మోపకుండా. పుట్టుక నుండి చావు వరకు జీవితమే తాత్కా లిక ప్రయాణం జరపడానికి వచ్చిన అతిథు లుగా మనం కాస్తంత వివేకంతో.. విచక్షణ తో..విజ్ఞతతొ ఏ వివాదాలకు తావి వ్వ కుండా.. తోటివారి హితమ్ పరమా వధిగా జీవించాలన్న చింతనను కలగజేయ డానికి.. గుర్తు చేయడానికి కవి రాజేశ్వ రరావు చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. దేవుడ్ని శ్రీ వేంకటేశ్వర స్వామిని విభిన్నమైన విధాలుగా సంబోధిస్తూ కవి సాగించిన సం భాషణను ఇందలి కవిత్వంలో చూడగలం-

కవి రాజేశ్వరరావుగారి కవిత్వంలో ఆధ్యాత్మికతతో పాటు పరహితచింతన.. కృతకమైన కోర్కెల చట్రంలో బందీలవ్వ కుండా విముక్తం కావాలన్న ఆకాంక్ష.. వంటి అంశాలను తాత్విక పునాదులపై ఆవిష్క రించే ప్రయత్నం చేశారు. విలక్షణమైన అభివ్యక్తితో.. వివేకవంతమైన ఆలోచనా ధారతో కవి 'మౌనమున' కావ్యాన్ని కొనసా గించి మసకబారుతున్న మానవ సంబంధా లకు మెరుగులు అద్దారు. బీటలు వారుతున్న బంధాలు అనుబంధాలను ఇకనైనా విచక్షణతో చక్కబెట్టుకోవాలన్న సంకల్పంతో కవి రాసిన ఇందలి కవితలు అందరి హృదయాలలో సదాచార సంపన్నతను అల వర్చగలవు దైవాన్ని పూజిస్తూ- పరాలకోసం వెంపర్లాడకుండా

కోరికల తోరణాన్ని సమ ర్పించకుండా మనో నిబ్బరాన్ని ప్రసాదించు మని దేవుడ్ని కోరుకోవాలన్న ఓ గొప్ప సందేశాన్ని ఇందలి కవిత్వం మనకు అందించగలదు.

భగవంతుని అనంత కృపను తక్కువ చేసుకోకుండా.. ఉపాసనతో దైవానికి దగ్గరవ్వాలని సూచిస్తూ ఆయా కవితల్లో రాసిన పంక్తులు అందరినీ ఇట్టే తట్టి లేపుతాయి.

నీకు నేనే
అందరిలో ఒకడిని
నాకేమో
నువ్వొక్కడివే అందరివి" అంటూ 'విలా పం' కవితలో నర్మగర్భంగా కవి ప్రకటించిన భావాలను అభినందించి తీరుతాం. అందరిలో దైవాన్ని సందర్శించు అన్న అర్థం ధ్వనించే విధంగా ఈ కవితను తీర్చిదిద్దారు.

ఇదే కవితలో..

నీ పట్ల నాకు గల చొరవకు అహంతో ప్రదర్శిస్తాను
నీ పుష్ప మాలికలోని ఒక పువ్వు ఫక్కున నవ్వుతుంది
రస గ్రంథులే లేని నన్ను చూడు!
స్వామి స్పర్శను ఒళ్ళంతా అనుభవి స్తున్నానని

అతిశయంగా పలుకుతుంది!!

అని కొనసాగించడంలో కవి యొక్క కవితా పటిమను ప్రదర్శించారు.

"మౌనమూర్తి" కవితలో.. దైవాన్ని స్తుతిస్తూ.. ప్రతి సందిగ్ధావస్థలోనూ..

నీ ముందు దోసిలి పడతాను
వరాలు గుప్పించుమని కాదు!
మనోబలాన్నిప్పించుమని! అంటూ ముగించిన తీరు బాగుంది.

కవి ఈ కవితలో అమ్మతో అలవర్చు కున్న సద్గుణాలను గుర్తు చేసుకున్నారు. బాల్య స్మృతులను ఏకరువు పెడుతూ..

ప్రభూ!
నువ్వు మాట్లాడలేవని అమ్మతో
అంటూ ఉండే వాడిని!
చిన్నప్పుడు-
అలా అనొద్దు అంటుండేది అమ్మ!
నువ్వు కోతల రాయుడివి కాదనీ



చేతలలో చూపిస్తావనేది
అలా
నేను నీ మౌనాన్ని కినుకగా
సర్ది చెప్పుకున్నాను.. అని ప్రకటించ డంలో కవి ఔచిత్యాన్ని పాటించారు.

కళ్లనిండా నిన్ను నిలుపుకోవడానికి
అమ్మ సదా నిన్నే పూజించేది!
మరెప్పుడు నీ కోరిక తీరుస్తాడమ్మా?
అనే వాడిని
కోరిక తీర్చుదురా! కన్నా
సమస్యను ఎదుర్కొనే ఆత్మస్థైర్యాన్ని ఇస్తాడనేది అమ్మ అంటూ దైవంతో కవి చేసిన సంభాషణం బాగుంది.

నువ్వసలు మాట్లాడవు
దుఃఖం సంద్రమై ఉప్పొంగినా
కన్నీరు జలపాతమైనా
సంతోషం విరిసి నింగినంటినా
నువ్వు ప్రేక్షకుడివి మాత్రమే!
మారు మాట్లాడని మౌనం నీది' అంటూ 'మౌనమును' కవితను చక్కగా రూపుదిద్దారు.

ఈ కవితలో వినూత్నమైన అభివ్యక్తితో కవి ప్రతిపాదించిన అంశాలు గొప్ప సందే శాన్ని మోసకొచ్చాయి. దైవాన్ని కోరికలు తీర్చుకుని కోరడం కాదు.. పరాలు గుప్పిం చుమని అడగడం కాదు.. సమస్యలను అధిగ మించే మనోబలాన్ని ప్రసాదించుమని ప్రార్థించాలని తేల్చి చెప్పారు.

'గడసరి' కవితలోనూ. విశ్వపుభారాన్ని మోసే దైవాన్ని సాయం చెయొచ్చుగా అని వేడుకుంటే.. కోరికల భారాన్ని మాత్రం మోయలేనన్న సమాధానాన్ని దైవంతో గడ సరిగా చెప్పించిన తీరు బాగుంది. **'ఓదార్పు'** కవితలోనూ కవి అభివ్యక్తిలో కొత్తదనాన్ని.. మరియు శిల్పం విషయంలో చతురతను ప్రదర్శించారు. ఏడుకొండల స్వామి.. పద్మా వతీ అమ్మవారి మధ్య సంభా షణ కొనసా గిస్తూ.. పద్మావతీ అమ్మవారితో అడిగించిన ప్రశ్నకూ స్వామివారి సమాధా నం చెప్పిం చడంలోనూ కవి తమ ప్రతిభను ప్రద ర్శించారు.

'అమ్మ' కవితలో.. అమ్మ ముఖాన్ని వెన్నెల సంగీతంతో పోల్చుతూ అప్పుడ ప్పుడూ అమ్మ మాకెవ్వరికీ కనబడకుండా ఏడ్చేది అంటూ ప్రారంభించారు. అమ్మ పడిన కష్టాలను ఏకరువు పెడుతూ.. అమ్మ తన బంగారమంతా పోపు డబ్బాల్లో దాచు కున్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 534వ రోజు ' నీటి బుడగ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. ' నీటి బుడగ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా..-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

బుడుంగుమనేదెప్పుడో!

క్షణ భంగురమైన జీవితం
నీటి బుడగ వంటిదే
ఏ క్షణంలో నశిస్తుందో
ఉన్నంత కాలం నిగనిగ
తెల్లని వజ్రపు మెరుపులు
కాంతిని చిందించే నీటి బిందువులా
బ్రతుకును మెరిపిస్తే
పోయినా మిగిలేది ఖ్యాతి
నశ్వర దేహం కొరకు
ఎందుకింత యాతన!!.
మెరుపుతీగ వంటిదే బ్రతుకు
క్షణమే మెరిసేది రంజింప చేసేది
పుట్టిన ప్రాణి పోక మానదు
గిట్టిన జీవి రాక తప్పదు
కాల చక్రంలో
చిక్కిన గాలంలో
ఎవరి బ్రతుకెంత కాలమో
మధ్యలోనే ఆర్భాటం
వెంట రాదని తెలిసీ
ఎందుకో ఆరాటం!!.
ఉన్న కొద్దిసేపైనా నవ్వుతూ
పరిమళాలు వెదజల్లుతూ
అందరి మదిని దొస్తూ
వికసించే
సుమం ఆదర్శం కావాలి!!!.
పరోపకారసేవ
సకల ప్రాణి హితం కోరి
చేసే నిస్వార్థ సేవను
మెచ్చే భగవంతుడు
ఉన్నంతలో ఉపకారం
బ్రతికినంత కాలం
పలువురి మదిలో
మెదిలే జీవనం సార్థకం!!.

-డా. చీదెళ్ల సీతాలక్ష్మి

బుద్బుదం

నీరు శాశ్వతం
నీటి బుడగ అశాశ్వతం..
మనిషి అశాశ్వతం
మనిషి చేసే మంచి శాశ్వతం..
అశాశ్వతాన్ని ఆశ్రయించి
అర్థం లేని పనులు
వ్యర్థ మయ్యే సమయం
కంఠశోషే శరణ్యం...
నీటి బుడగ జీవితానికి
నీతిసూత్రాలు అన్వయించి
నీటి బుడగ తత్త్వంతో
తామరాకుమీద నీటి బొట్టు చందం
జీవితం అందం
సమాజసేవలో తరించి
నీటి బుడగ జీవితాన్ని
శాశ్వతం గా మలుచుకో.

- మోటూరిశాంతకుమారి

తెలుసుకో నేస్తం

ఏది నీది కాదు
నీవు ఎవరికీ దక్కవు
అన్ని నావే అనుకోని
ఆశలు పెంచుకోకు నేస్తం !!
అశాశ్వతమైన ఆనందానికి
అహర్నిశలు ఆయాసం
ఎందుకో ఈ ఆరాటం
ఎవరికోసం ఈ ఆవేశం
నా వారి కోసమని నగుబాలుకాకు
నలుగురిలో అవమానం కాకు!!
సంపాదించింది సగమే నీకు
మిగిలింది నీవెంట రాదు
కని పెంచిన వాళ్ళు లేరు
నీవెంబడి ఎవ్వరూ రారు
కనికరించి వారు లేరని
కలత చెందకు నేస్తం !!.
బాల్యం భారంగా గడిచిందని
యవ్వనం లో మజా చేయకు
వృద్ధాప్యం లో విసుగు చెందకు
జీవితం బుద్బుద ప్రాయం
జీవితం నీకోసం కాదు అందరిదీ
భవిష్యత్ తరాలదనుకో !!.
జీవితం నీటి బుడగ లాంటిది
ఉన్నంత వరకే సాధించు
శాశ్వతంగా పేరు నిలబెట్టు
చిరాయువుగా జీవించు !!.

- జి. కొండల్ రావు

క్షణభంగురం!

నీటిబుడగ జీవితం
ఎప్పుడు ఠాప్ అనునో!?
క్షణభంగురం బతుకులో
రంగు రంగుల ఆరాటపోరాటాలు!
సింగిడీల మెరుపుల మరకలు
గాలిలో తేలునా?
మటుమాయమై కానరాని
లోకాలకి తరలునా?
వర్షపునీటిలో చిట్టిచేతుల చప్పట్లు!
తపతప అడుగులతో బుడతల
ముచ్చట్లు!
సబ్బునీటితో రంగుల సింగిడీలు!
ఎగురుచు ఆశలరేపు!
శీతలపానీయాల మూతలతో గంతులువేయు!
గుటకేస్తుంటే బుడుంగున
పొట్టలోకి జర్రున జారు!
ఎగిరే వన్నెలసీతాకోకచిలుకల
వయ్యారాల ఊరించేబుడగలు!
పైకి ఎగరలేని నీటిబుడగల
ఆశలరెక్కలుఊడిన బడుగు జీవులు!
ఏదో ఉందని భ్రమ?
ఠాప్ అని బద్దలయ్యే !
కన్నీటి సంద్రంలో కొట్టుకుపోయే!.
అందాశయంలో నీటిబుడగలు
సమస్యల రోగాలసుడిగుండాలు
బాల్యపు బుడగలతో ఆటలు!
నేడు ప్రాణాంతక వ్యాధులు!

పదాలు అక్షరాలు ఒకటే!
ఆనాటి బాల్యపు నీటిబుడగ
నేడు ఉదరంలో చేరి గడబిడ
అందుకే ఓమనిషీ!
బుద్బుదప్రాయం బతుకు అని
తెలిసీ ఎందుకు పాపపంకిలంకై
పరుగులు తీసేవు?
బురదనీటి బుడగవు కావద్దు
పైపైకి ఎగిరే పతంగిగా మారు!.
-ఎ.రాజ్యశ్రీ

జీవనమే నీటిబుడగ

మనిషి జీవనం నీటిబుడగ
ఎప్పుడూ ఉంటామో.
ఎప్పుడూ పోతామో తెలియదు.
నీటిలోని బుడగలా మాయం
మనిషి జీవితం క్షణ భంగురం
జీవితాన్ని అందంగా మల్చుకునేందుకు
మంచి మాట
మంచి మనసుతో
మనిషి బతికినంత కాలం
పేరు శాశ్వతం.
క్షణకాల జీవితంలో
మనిషి
మనిషిగా బతకాలి.

- వి.సంధ్యా రాణి

చేసుకో సార్థకం

నీటి బుడగ జీవితం
ఓటి పడవ యవ్వనం
కవి పలుకులు అక్షర సత్యం
దేహం తాత్కాలికం
ఆత్మ శాశ్వతం
మనుజ లోకాన
సర్పం అశాశ్వతం
నీది నాదన్నది
అంతా భ్రాంతి మయం
వంపుసొంపుల
వయ్యారి వగలాడి దేహం
వృద్ధాప్యాన కనలేని వింత వికారం.
కట్టుకున్న అద్దాల మేడలు అతిథి పాలు
అనుభవించక పోగేసిన పైకం పరుల పాలు
ఐన వాళ్లెవరు కడవరకు వెంటరారు
మనిషి జీవితమంతా ఒంటరి పోరు
మమకారంతో పెంచి పోషించిన దేహం
తుదకు ఆరడుగుల ధరణి పాలు
నీటి బుడగవంటి జీవితంపై
పెంచకు వ్యామోహం
పెంచుకోకు
ఈ సుందర దేహంపై మొహం
ఉన్నంతలోనే చేసుకో పరోపకారం
బతికున్నప్పుడే
ఇలలో చేసుకో దానధర్మం
సంపాదించుకో
పైలోకాలకు కొంత పుణ్యం
అప్పుడే జన్మకు సార్థకం
పుణ్యం పురుషార్థం.

- జె.వి.కుమార్ చేపూరి

జీవుడు

ఉండెకదే!మరెందుకది నుండక పోవుట సంభవించెనే?
నుండగ లేనిచో నిచట నూరక వచ్చుట నెందుకోసమో?
నుండక పోవగా మరల నూయల నూగిన రీతిగాతనే
నిండుగ నీటితో బుడగ నిండని తీరున వచ్చిపోవునే?.

- రుద్రాక్షల మఠం ప్రభులింగశాస్త్రి

బుడగ

కం. ఆటలకానందమ్మును
నీటి బుడగలిడును మనసు నేస్తము గోరన్
తోటి వయస్కులు కలసిన
ధీటుగ నిను నీలుప గోరు దిగ్గజము వలెన్!.
కం. నోటను బుడగలు ముదమగు
చేటును చేకూర్చు దాని స్నేహము నమ్మన్
కోటి వరమ్ముల మాటలు
పోటీపడి పగిలి పోవు భోగమువీడన్!! .
చం. తనువును పోల్చు బుద్బుధము తన్మయ మొందకు సౌఖ్యముండగన్
కనపడు సప్తవర్ణములు కల్లలు శాశ్వత మేది కాదు:; మే
దినివెతకంగ మూర్ఖులకు తేజము గూర్చును భ్రాంతి వెల్లులై
జననము దేహ ధారణము చంచల చక్రపు బుద్బుదమ్ములే!!
ఆ.వె. నిక్కపొడిచి యెగురు నింగి తాకెదనని
కొద్ది పాటి కదిలి కూలి పోవు
ధనము,మదము,గలుగు దర్పనట్టిదే
నీతి లేని నిండు నీటి బుడగ!!.

- మాడుగుల నారాయణ మూర్తి

నిలవని నీటిబుడగ

నీటి బుడగ చెప్పేది జీవిత సత్యం
జీవితం బుద్బుద ప్రాయమని
యిట్లా వచ్చి అట్లా వెళ్లి పోయేదని
నీటిపై తేలియాడేంత తేలికైనదని
బ్రతుకు శాశ్వతనీ కాదని
అశాశ్వతమని.
ఆకాశంలో యింద్ర ధనస్సు వస్తే
తనపై ప్రతిబింబాన్ని ప్రతిఫలిస్తుంది
సప్త వర్ణాలతో కనిపిస్తుంది
ఒక్క నీటిచుక్క మీదపడితే చాలు
క్షణనీలో చిన్నా భిన్నమై పోతుంది
ఎవ్వుడు ఎక్కడ ఎట్లా పుడుతుందో
ఎవ్వరికీ తెలియదు
వర్షంలో వరదల్లో బాగా కనిపిస్తుంది
ఒపికవున్ననీత సేపు ప్రయాణిస్తుంది
తనువును విడిచి ఆత్మ అదృశ్యమైనట్లు
ఎప్పుడో వెళ్లిపోతుంది
పిల్లలు ఊదిన సబ్బు నురగ బుడగ
పుట్టిననీతసేపు
గాలిలోనే దాని ప్రయాణం
ప్రయాణం చేస్తూనే 'టప్ ' మంటుంది
పసికూనకు ఆనందమిస్తుంది
పాపం వాడికేనీ తెలుసు
అది నిలవని నీటిబుడగని.

- కందుకూరి మనోహర్

అంతాశూన్యం

పుట్టుక నిజం
పోవడం నిజం
నట్టనడిమిటిది నాటకమని
తెలియజేస్తుంది
నీటిబుడగ.
పుట్టిన క్షణమే
తనపై ఇంకోటి పడితే
తాను ఉనికిని కోల్పోతున్న
విషయం .....
విదితం చేస్తున్నది
నీటిబుడగ
తరతరాల భారతీయ
తత్వబోధనకు
ప్రతీక ....
ఈ నీటిబుడగ
సూర్యచంద్రుల గమనంలో
వెలుగుచీకట్లెంత సహజమో
జీవితానుభవంలో
నీటిబుడగ తత్వం
అంతే ప్రాధాన్యం
ఎప్పుడస్తమిస్తామో
తెలియని జీవితాన
వెంపర్లాడడం మానేసి
సమాజానికి
వీలైనంత సాయం చేద్దాం
జీవితాన్ని సమాజసేవకు
త్యాగం చేసి
కలకాలం మానవమస్తిష్కంలో
గుర్తుండిపోదాం.

-ఆర్.కళ్యాణి

కాలుష్యాన్ని పెంచి పోషించే అభివృద్ధి అర్థరహితం

పర్యావరణ కాలుష్య సంక్షోభంతో ప్రజారోగ్యం గాల్లో దీపం అవుతున్నదని, లక్షల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని తాజా 'లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్' ప్రచురించిన 'పొల్యూషన్ అండ్ హెల్త్ : ఏ ప్రొగ్రెసివ్ అప్‌డేట్' అనే పరిశోధనా వ్యాసం కఠిన వాస్తవాలను వివరిస్తున్నది. ఐరాస వివరణ ప్రకారం పర్యావరణ విచ్ఛిన్న మానవ వ్యార్థాల కారణంగా నేల, నీరు, గాలి నాణ్యత పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నది. గాలిని కలుషితం చేసే పియం 2.5, ఓజోన్, సల్ఫర్/నైట్రోజన్ ఆక్సైడ్లతో పాటు నీటిని కలుషితం చేస్తున్న పాదరసం, నైట్రోజన్, ఫాస్ఫరస్, ప్లాస్టిక్, పెట్రోలియం వ్యర్థాలు ప్రధాన కాలుష్య కారకులుగా ఉన్నాయి. వీటికి తోడుగా నేలను కలుషితం చేస్తున్న లెడ్, పాదరసం,ఎరువులు, పెస్టిసైడ్లు, పారిశ్రామిక రసాయనాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, రేడియోధార్మిక వ్యర్థాలు జీవకోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

కాలుష్య దుష్ప్రభావాల ఫలితం:

పర్యావరణ కాలుష్యం కారణంగా 23.5 లక్షల అకాల మరణాలు సమోదు అయ్యాయని, ఒక్క గాలి కాలుష్య భూతంతోనే 16.7 లక్షల మరణాలు, కేవలం పియమ్ 2.5 గాలి కాలుష్యంతో 9.8 లక్షల మరణాలు, గృహ సంబంధ కాలుష్యంతో 6.1 లక్షల మరణాలు జరిగాయనే భయంకర వాస్తవాన్ని 'లాన్సెట్' అధ్యయన పరిశోధనా వ్యాసం వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పలు రకాలైన కాలుష్య కోరల్లో చిక్కి 9 మిలియన్ల ప్రజలు మరణించారని, వీరిలో అత్యధిక మరణాలు ఇండియాలో సమోదు అయ్యాయనే కఠిన వాస్తవాన్ని 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజెస్, ఇంజూరీస్, అండ్ రిస్క్ ఫాక్టర్స్' అనబడే అధ్యయన వివరాలను బయట పెట్టింది. ఇండియాలో నీటి కాలుష్యం బారిన పడి 5 లక్షల మరణాలు, వృత్తిపరమైన కాలుష్యంతో 1.6 లక్షల మరణాలు, సీసం (లెడ్) కాలుష్యంతో 2.3 లక్షల మరణాలు జరిగాయని తెలుస్తున్నది. గృహ, పరిసర సంబంధ కాలుష్యంతో మాత్రమే ప్రపంచవ్యాప్తంగా 6.67 మిలియన్ల మరణాలు (ప్రపంచ మరణాల్లో 17.8 శాతం) జరిగాయని తెలుస్తున్నది. పేదరికంతో సంబంధాన్ని కలిగిన కాలుష్య మరణాలు కొంత తగ్గినప్పటికీ గాలి, లెడ్ కాలుష్య మరణాలు ఏటేటా క్రమంగా పెరుగుట గమనించబడింది. 2019లో నమోదైన సగటు ఆయుర్దాయం పురుషులకు 69.5 ఏండ్లు, మహిళలకు 72 ఏండ్లుగా ఉండగా 2020లో పురుషులకు 67.5 ఏండ్లు, మహిళలకు 69.8 ఏండ్లుగా మాత్రమే రికార్డు కావడం విచారకరం.

కాలుష్యాలకు కారణాలు:

పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, జనాభా విస్ఫోటనం, శిలాజ ఇంధన వినియోగం, కాలుష్య నివారణ చర్యలు లేకపోవడం లాంటి కారణాలతో ప్రజారోగ్యం పడకేయడం జరిగింది. నీటి కాలుష్యంతో పిల్లలు, మహిళలు అధికంగా అనారోగ్యాలపాలు అవుతున్నారు. యుద్ధాలు, ఉగ్రవాదం, మలేరియా, హెచ్ఐవి, టిబి, మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ లాంటివి కూడా కాలుష్యాల కారణంగానే జరుగుతున్నట్లు తేలింది. బయోమాస్/బొగ్గు దహనం, వ్యవసాయ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చడంతో గాలి కాలుష్యం రెచ్చిపోతున్నట్లు తేలింది. ప్రపంచ గాలి నాణ్యత నివేదిక-2021 ప్రకారం భారతదేశంలోని 50 నగరాల్లో 35 నగరాలు గాలి గరళ కాలుష్యంతో సతమతం అవుతున్నట్లు తేలింది. మన దేశ రాజధాని వరుసగా నాలుగవ సారి ప్రపంచంలోనే అత్యధిక కాలుష్య నగరంగా రికార్డు సృష్టించిందని మనకు తెలుసు. పలు కాలుష్య కారణాలతో 2015 తరువాత 7 శాతం, 2000ల అనంతరం 66 శాతం మరణాలు పెరగడం గమనించారు. పేద, మధ్య ఆదాయ దేశాల్లో కాలుష్యాలను తగ్గించడానికి పెద్దగా ప్రయత్నాలు జరగడం లేదని, సత్వరమే కాలుష్య నియంత్రణకు ప్రపంచదేశాలు పలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ఒకవేళ ఇలాగే నిర్లక్ష్యం చేస్తే కాలుష్య గరళంతో ప్రపంచ మానవాళి పలు అనారోగ్యాలు, అకాల మరణాలను ఎదుర్కోవలసి వస్తుందని మరువరాదు.

వాతావరణ ప్రతికూల మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, అకాలవర్ష వడగళ్లు, జీవ వైవిధ్య విచ్ఛిన్నం, పెరుగుతున్న కాలుష్య గాఢతలతో మానవ జీవితాలు ప్రభావితం కావడమే కాకుండా జీవకోటి మనుగడ కూడా ప్రశ్నార్థకం అవుతున్నాయి. వాతావరణ మార్పులతో అసాధారణ కరోనా లాంటి విపత్తులు, అంటువ్యాధులు ప్రబలడం మానవాళిని పట్టి పీడిస్తున్నాయి. భారతంలో 2021 ఏడాది 1.93 లక్షల మంది డెంగ్యూ అంటువ్యాధి బారినపడగా, 2018 తరువాత అత్యధికంగా 306 మంది మరణించడం కూడా గమనించారు. అకాల వర్షాలతో అంటువ్యాధులు రెచ్చిపోతున్నాయి. భూతాపంతో వాతావరణ మార్పులు పెరగడం ప్రాణికోటికి ప్రమాదకరంగా మారుతున్నది. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం నానున్న 80 ఏండ్లలో భూతాపంతో సగటు వాతావరణ ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగితే మనిషి/ప్రాణికోటి మనుగడ మహాసంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తున్నారు. గాలి కాలుష్యంతో ఆసియా, పసిఫిక్ దేశాలపై భారీగా ఆర్థిక భారం పడుతున్నదని తెలుసుకోవాలి.

ఆధునిక కాలుష్యం - నియంత్రణ:

ఆధునిక గాలి కాలుష్య కారకాలైన లెడ్, రసాయన కాలుష్యాలను సత్వరమే కట్టడి చేయాలి. కాలుష్య నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడం, నిధులను కేటాయించడం, కఠినంగా చట్టాల అమలు, ప్రపంచ దేశాలు, ప్రాంతాల మధ్య కాలుష్య కట్టడికి సమన్వయం పెరగడం, గృహ సంబంధ గాలి కాలుష్య కట్టడి పటిష్ట చర్యలు సత్వరమే అమలు చేయాలి. భూగోళ కాలుష్యానికి కారణం ఏకైక మానవుడే. తాను తీసుకున్న గోతిలో తానే పడేందుకు నరుడు సిద్ధపడుతున్నాడు. ఆరోగ్యం దూరమైతే మన ఆస్తులు దేనికీ అక్కరకురావు. తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్నాడు నేటి సాంకేతిక నవ్య నరుడు. అభివృద్ధి సుస్థిరంగా, పర్యావరణ హితంగా ఉండాలి. కాలుష్యాన్ని పెంచి పోషించే అభివృద్ధి మనకు అవసరం లేదు. దీపం ఉండగానే ఇల్లు సక్కదిద్దుకుందాం. చేతు లు కాలక ముందే ఆకులు సిద్ధం చేసుకుందాం. కాలుష్య భూతాన్ని తరిమేసే మహాయజ్ఞంలో మనం భాగం అవుదాం. జీవకోటి పెన్నిధి భూమాతను కళ్లల్లో పెట్టి చూసుకుందాం. కాలుష్యమే కానరాని నాణ్యమైన ఆవాసాలను భూఉపరితలంపై నిర్మించుకుం దాం. స్మార్ట్ ఆలోచనలను అమలు చేసి, ఆరోగ్యకర పర్యావరణ స్వప్నాలను సాకారం చేసుకుందాం. సామాన్య జనంలో చైతన్య దీపాలను వెలిగిస్తూ, రాబో యే తరాలకు ఆరోగ్య కర భూవాతావరణాన్ని బహుమతిగా ఇద్దాం.

-డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

కపోత సందేశం పుస్తకావిష్కరణ

ఆదివారం స్థానిక విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపం వేదికగా మంచిర్యాల పట్టణానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్ గారు రచించిన గ్రంథము తెలంగాణ రాష్ట్ర శాసన సభా సభ్యులు గౌరవనీయులు శ్రీ నడిపెల్లి దివాకర్ రావు గారు ఆవిష్కరించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రంథము పదుగురికి ఉపయోగ పడే విధముగా వున్నదని ఇందులో చారిత్రిక మరియు ఆధ్యాత్మిక విషయాలు ఉన్నాయని కొనియాడినారు ఈ కార్యక్రంలో ప్రముఖ కవి బహు భాషావేత్త నలిమెల భాస్కర్ గారు బహు గ్రంథ కర్త సబ్బని లక్ష్మి నారాయణ గారు విశ్రాంత డి. యస్.పి యస్.యస్.కోటేశ్వర రావు గారు మలయశ్రీ నందమయ్యా పాలుగోని కవి శ్రీనాథ్ గారిని వారు రచించిన గ్రంథాన్ని పలువిధములుగా కొనియాడినారు యస్.నీలా దేవిగారు పుస్తక సమీక్ష చేసినారు కార్యక్రమంలో కవి డా.దాసరి శ్రీనాథ్ గారు వారి మాతృ మూర్తి శ్రీమతి దాసరి సుశీలావెంకటనర్సు గారికి మాతృ పూజ నిర్వహించి వారి కుటుంబ పక్షాన అనాథ వృద్ధ శరణాలయానికి 50 కిలోల సన్నబియ్యం విరాళంగా ఇచ్చినారు

ఈనెల 22నన డా॥కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో సాహితీకిరణం నిర్వహించిన కార్యక్రమంలో డి.పంకజమల్లిక్ రచించిన 'ఒక రాగం పలికింది' వ్యాససంపుటిని డా॥కె.వి.రమణాచారి ఆవిష్కరించగా, డా॥వోలేటి పార్వతీశం సభకు అధ్యక్షత వహించారు. చిత్రంలో తంగిరాల చక్రవర్తి, పొత్తూరి సుబ్బారావు, డి.మల్లికార్జునరావు,గుదిబండి వెంకటరెడ్డి, పెద్దూరి వెంకటదాసు, నీతా చంద్రశేఖర్. పొత్తూరి జయలక్ష్మితో కలిసి నీతా చంద్రశేఖర్‌కి అంకితం కావిస్తున్న రచయిత్రి.

ఈ నెల 21న త్యాగరాయగానసభలో శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు జయంతి సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ కవి, విమర్శకులు రమణవెలమకన్ని. వేదికపై పండిట్ అంజుబాబు, తిరుమాణి చంద్రశేఖర్, దేవిప్రసాద్, కళా వి.యస్.జనార్థనమూర్తి, వై.ఎస్.మూర్తి.

కణిక

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాధ్వా'

పోటీ ఫలితాలు

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

(ప్రథమ)

పున్నమి

పున్నమి వెన్నెలలో మదిలో ఊహలు
మధురములై వికసించే పూవులు
ప్రియునికై ఎదురుచూసే ప్రేయసి
కన్నుల వెలుగులు
బుగ్గలలో మెరిసే అరుణిమలు.
అమృతం కురుస్తుందా భూమిపై
చల్లని తెల్లని చంద్ర కిరణాలు
ఎన్నో ఔషధ పుట్టుకలు
నాగుల ప్రేమ సయ్యాటలు
కలువరేడు నును సిగ్గులు
సాగరంలో పోటెత్తే తరంగాల ఘోషలు
దంపతుల మదిలో మెదిలే చిలిపి కోరికలు
మదనుడి శరం ఎవరిమీదో
వెన్నెల ఆహారమైన పక్షి రెక్కల సవ్వడి
గగనం విహరించే రారాజు
పౌర్ణమి చంద్రుడు
డాబాల మీద చేసే వెండి వెన్నెల
భోజనాలు
జరిపే సత్యదేవుని ప్రతాలు
అందమంతా ఆ నెలరేడుదేగా



-ఎం. అరుణ కుమారి

(ద్వితీయ)

వెన్నెలపూలు

అందరికీ మేనమామ ఒకే చందమామరా
ఈ జగతిన కురిపించే వెన్నెలలా
వెలుగులరేడురా
మహిన వెలిగి మనసుదోచు మాయగాడు
కలువభామ సొగసులను
చేరదీయు చందురుడు
అమ్మ పిలుపు మెరుపులతో
పరుగెత్తే మామవీడు
బుజ్జాయి బొజ్జనింపి ఆకలితీర్చు నెలరేడు
చిన్నారుల చిరునవ్వుల జల్లులలో
మునిగేటి అందమైన
సుందరీడు
ఆటుపోటు అల్లరితో
సముద్రునితో ఆటలాడు అల్లరోడు
ప్రేమికుల మనసుదోచి
గిలిగింతలు పెట్టువీడు
చంద్రవంక చమరింతతొ
చెలిమిచేయు జాబిలీడు
రామయ్యను నవ్వించగ
అద్దంలో చిక్కివీడు
అందాల నవ్వులను
దోచుకున్న దొరవీడు.

-డా॥బండారి సుజాత
హన్మకొండ

వెలుగు దివ్వెలు కవితా సంపుటి ఆవిష్కరణ

ఈనెల 22న కందుకూరులో శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో జరిగిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో శ్రీ పిల్లి హజరత్తయ్యగారు రచించిన ×వెలుగు దివ్వెలు× అనే కవితా సంపుటిని కందుకూరు శాసనసభ్యులు శ్రీ మానుగుంట మహీధర్ రెడ్డి గారు మరియు శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్, సాహిత్య భూషణ్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కందుకూరు శాసనసభ్యులు శ్రీ మానుగుంట మహీధర్ రెడ్డి గారు మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు కవులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ×వెలుగు దివ్వెలు× కవితా సంపుటిని ప్రతి ఒక్కరూ చదివి సామాజిక స్పృహను పెంచుకోవాలని ఆకాంక్షించారు. జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ గారు మాట్లాడుతూ యువ కవులను ప్రోత్సహించడమే శ్రీ శ్రీ కళా వేదిక ముఖ్య ఉద్దేశ్యమని, ఆ దిశగా మా ప్రయాణం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ×వెలుగు దివ్వెలు× కవితా సంపుటిని రచించిన శ్రీ పిల్లి.హజరత్తయ్య గారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ శ్రీమతి కొల్లి రమావతి గారు, జాతీయ ఉపాధ్యక్షురాలు శ్రీమతి చిట్టే .సిద్ద లలితా గారు,